

ఈత కొట్టు... ఆరోగ్యం పట్టు!
» స్విమ్మింగ్‌తో చక్కని శరీర సౌష్ఠవం
» నిత్యం ఫిట్‌గా ఉండేలా దోహదం
» దీర్ఘకాలిక వ్యాధులను దూరం చేసే వ్యాయామం - 8లో





నార్త్‌కోస్ట్ సీఈ కార్యాలయంలో మధ్యలో నిలిచిన భవనం

పునాదికే రూ.10 కోట్లా!?

జల వనరుల శాఖ లెక్కలపై అనుమానాలు

» నిధులు దుర్వినియోగం అయ్యాయనే ఆరోపణలు

విశాఖపట్నం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): నార్త్ కోస్ట్ జల వనరుల శాఖ చీఫ్ ఇంజనీర్ కార్యాలయ ప్రాంగణంలో మూడేళ్ల క్రితం మొదలెట్టిన భవన నిర్మాణం ఇప్పటికీ అసంపూర్తిగానే దర్శనమిస్తోంది. అధికారులు మూడు అంతస్థుల భవనం నిర్మించేందుకు... ఏడు అంతస్థుల భవనానికి తగ్గ పునాది తీయించారు. అందుకు భవన నిర్మాణ బడ్జెట్ రూ.10 కోట్లూ ఖర్చు చేసేశారు. నిధులు అయిపోవడంతో భవన నిర్మాణంతో తమకు సంబంధం లేదంటూ చేతులు దులిపేసుకున్నారు. ఉన్నతాధికారులు చొరవ తీసుకుని ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టు నిధుల నుంచి రూ.5.5 కోట్లు వెచ్చించి మూడో అంతస్థు వరకూ నిర్మించారు. కానీ ఇప్పటికీ పనులు పూర్తికాలేదు. భవనం వినియోగంలోకి రాలేదు.

» వైసీపీ హయాంలో నార్త్ కోస్ట్ జల వనరుల శాఖ చీఫ్ ఇంజనీర్ కార్యాలయ ప్రాంగణంలో డేటా సెంటర్ కోసం భవన నిర్మాణం ప్రారంభం
» మూడు అంతస్థుల భవనానికి ఏడంతస్థుల స్థాయిలో పునాది
» కేటాయించిన బడ్జెట్ మొత్తం ఖర్చు
» అవగాహన లేకుండా డిజైన్ మార్పు
» ఆ తరువాత మరో రూ.5.5 కోట్లు మంజూరు
» అయినా అసంపూర్తిగానే భవనం

వైసీపీ ప్రభుత్వం విశాఖను పాలనా రాజధాని చేస్తామనడంతో ఇతర శాఖల మాదిరిగానే జల వనరుల శాఖ హడావిడి చేసింది. త్రీటౌన్ పోలీస్ స్టేషన్ సమీపంలో గల నార్త్ కోస్ట్ సీఈ కార్యాలయ ప్రాంగణంలో రోడ్డుకు ఆనుకుని ఖాళీగా ఉన్న స్థలంలో హైడ్రాలాజికల్ విభాగానికి డేటా సెంటర్ భవనం నిర్మించాలని ప్రతిపాదించింది. మూడు అంతస్థుల్లో భవన నిర్మాణానికి (సెల్లార్, స్టిల్ట్+ఒక ఫ్లోర్) రూ.10 కోట్లు నిధులను భూగర్భ జల శాఖ మంజూరు చేసింది. కింద రెండు అంతస్థులు పార్కింగ్, ఇతరత్రా అవసరాలకు వినియోగించాలని, మూడో ఫ్లోర్‌లో డేటా సెంటర్ ఏర్పాటుచేయాలని ప్రతిపాదించారు. రాష్ట్రంలో భూగర్భ జల శాఖ, జల వనరుల శాఖకు చెందిన మొత్తం డేటా అంటే నదులు, చెరువులు, రిజర్వాయర్లలో నీటి నిల్వలు, భూగర్భ జలాల వివరాలు ఈ సెంటర్‌లో నిక్షిప్తం చేయాలనుకున్నారు. నిర్మాణ పనులను జల వనరుల శాఖ విశాఖ రెగ్యులర్ డివిజన్‌కు అప్పగించారు. టెండర్లు పిలిచి పనులు ప్రారంభించారు. ముందుగా అనుకున్న డిజైన్‌ను కొందరు అధికారులు మార్చేశారు. భవిష్యత్తులో ఏడు అంతస్థులు నిర్మించుకోవాల్సి వస్తుందనే ఆలోచనతో అందుకు తగ్గట్టు పునాదులు తవ్వించారు. దీంతో నిర్మాణాలు చేపట్టే ప్రాంతానికి ఆనుకుని ఉన్న హెరిటేజ్ భవనం కుప్పకూలిపోయింది. అయినా అధికారులు ... మిగతా 6వ పేజీలో

తీరం పటిష్ఠం

కోత నివారణకు రూ.200 కోట్లతో ప్రణాళిక

» ఆర్‌కే బీచ్ నుంచి భీమిలి వరకూ పనులు
» కొన్నిచోట్ల రక్షణ గోడలు నిర్మాణం
» మరికొన్నిచోట్ల మడ అడవుల పెంపకం
» వీఎంఆర్‌డీఏ ప్రణాళిక
» ప్రకృతి విపత్తుల నివారణ కింద నిధుల మంజూరు కోసం కేంద్రానికి ప్రతిపాదనలు



కోతకు గురవుతున్న సముద్రతీరం

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

జిల్లాలో సముద్ర తీరం కోతకు గురికాకుండా ఉండేందుకు విశాఖ మహా నగర ప్రాంత అభివృద్ధి సంస్థ (వీఎంఆర్‌డీఏ) ప్రణాళిక సిద్ధం చేసింది. సముద్రంలో సంభవించే మార్పుల వల్ల ఆర్‌కే బీచ్ నుంచి భీమిలి వరకు పలు ప్రాంతాల్లో తీరం కోతకు గురవుతోంది. పర్యావరణ సమతుల్యత దెబ్బతినడమే కాకుండా విలువైన నిర్మాణాలకు నష్టం వాటిల్లుతోంది. ముఖ్యంగా ఆర్‌కే బీచ్‌లో గోకుల్ పార్కు, కురుసుర సబ్‌మెరైన్, రుషికొండ, మంగమారిపేట, భీమిలి తోటవారి వీధి వంటి ప్రాంతాల్లో తీరం బాగా కోతకు గురవుతోంది. వీటిని తాత్కాలికంగా పటిష్ఠం చేస్తున్నా ప్రయోజనం ఉండడం లేదు. అందుకని నేషనల్ సెంటర్ ఫర్ కోస్టల్ రీసెర్చ్ సంస్థతో కలిసి పనిచేయాలని వీఎంఆర్‌డీఏ నిర్ణయించింది.

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వీలైనంత వరకు కేంద్ర ప్రభుత్వ పథకాలను ఉపయోగించుకోవాలని సూచించింది. ఈ సూచనతో వీఎంఆర్‌డీఏ కమిషనర్ విశ్వనాథన్ నేషనల్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీలో ప్రకృతి విపత్తుల నివారణకు నిధులు ఉన్నాయని, అవి తీర ప్రాంత కోత నివారణకు ఇచ్చే అవకాశం ఉందని గుర్తించి ప్రణాళిక రూపొందించారు. ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, పురపాలక శాఖా మంత్రి నారాయణ విశాఖపట్నం వచ్చినప్పుడు...కోత నివారణకు చేపట్టబోయే చర్యల గురించి వివరించి ఆమోదం తీసుకున్నారు. దీనికి రూ.200 కోట్లు వ్యయం కాగలదని అంచనా వేశారు. ఇందులో కేంద్రం 90 శాతం నిధులు ఇస్తే మిగిలిన 10 శాతం రాష్ట్ర ప్రభుత్వం భరిస్తుంది.

ఏమి చేస్తారంటే...?

» తీరం కోతను సాధారణ, అసాధారణ నిర్మాణాలతో నివారిస్తారు.
» తీర ప్రాంత పర్యావరణాన్ని పునరుద్ధరిస్తారు. ప్రకృతిపరంగానే తీరం వృద్ధి చేస్తారు.
» తీర ప్రాంతాల్లో ... మిగతా 6వ పేజీలో

ఎక్కడెక్కడ..?

» భీమిలి బీచ్‌రోడ్డు, తోట వీధి, ఆర్కే బీచ్‌లోని సబ్‌మెరైన్ ఏరియాలో రూ.25 కోట్లతో రిటెన్షన్ గోడలు కడతారు.
» గోకుల్ పార్కు వద్ద కోటి రూపాయలతో గ్రోయిన్ నిర్మిస్తారు.
» రుషికొండలో రూ.10 కోట్లతో బీచ్ నరిష్‌మెంట్ ద్వారా ఇసుకను డంప్ చేస్తారు.
» చేపలుప్పాడలో ఇసుక దిబ్బలు కరిగిపోకుండా రూ.4 కోట్లతో చర్యలు చేపడతారు.
» భీమిలిలో మత్స్యకారులు బోట్లు నిలుపుకొనే ప్రాంతం, మంగమారిపేట, పెదజాలరిపేట, జాలారి ఎండాడ, వాసవానిపాలెం నుంచి శివగణేశ్ నగర్ వరకు తీరం వెంబడి రూ.60 కోట్లతో సముద్రపు (సీ) గోడలు నిర్మిస్తారు.
» ఎక్కడైనా కొత్తగా తీరం కోతకు గురైతే అక్కడ గ్రోయిన్ ఫీల్డ్ అభివృద్ధి చేస్తారు. దీనికోసం రూ.60 కోట్లు రిజర్వ్‌లో ఉంచుతారు.
» సాగర్‌నగర్, తిమ్మాపురం ప్రాంతాల్లోను, చేపలుప్పాడ నుంచి భీమిలి వరకూ వీలైన ప్రాంతాల్లో మడ అడవులను పెంచుతారు. మత్స్యకారులకు తీర రక్షణపై అవగాహన కల్పించి, శిక్షణ ఇస్తారు. వీటి కోసం రూ.40 కోట్లు ఖర్చు అవుతుందని అంచనా వేశారు.

రైతుబజార్ల సిబ్బందికి బదిలీలు

» మొదట ఈవోలకు, ఆ తరువాత సహాయకులకు...
» జాయింట్ కలెక్టర్‌కు ఫైలు
» విద్యా సంవత్సరం పూర్తయ్యేంత వరకూ ఆగాలని పలువురి విజ్ఞప్తి



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

జిల్లాలో రైతుబజార్ల సిబ్బంది బదిలీలకు సన్నాహాలు జరుగుతున్నాయి. రాష్ట్రంలో అన్ని శాఖల బదిలీలు పూర్తయిన తరువాత తీరుబడిగా ఇప్పుడు ప్రక్రియ ప్రారంభించడంపై సిబ్బంది వ్యతిరేకత వ్యక్తంచేస్తున్నారు. విద్యా సంవత్సరం మధ్యలో బదిలీలు చేయడం తగదని, ఇంకో ఐదు నెలలు (ఏప్రిల్ వరకూ) ఆగాలని డిమాండ్ చేస్తున్నారు. అయితే మార్కెటింగ్ శాఖ కమిషనర్ మాత్రం రైతుబజార్లలో రెండేళ్లు దాటిన వారిని బదిలీ చేయాలని ఉత్తర్వులు జారీచేశారు. ఆ ప్రకారం గోపాలపట్నంలోని వ్యవసాయ, మార్కెటింగ్ శాఖాధికారులు ఫైలు తయారుచేశారు. వాస్తవానికి కార్యాలయానికి పిలిచి కౌన్సెలింగ్ నిర్వహించాల్సి ఉండగా, ఫోన్ల ద్వారానే అభిప్రాయాలు తెలుసుకొని ఆ మేరకు బదిలీలకు సన్నాహాలు చేసినట్టు తెలిసింది.

నగరంలో మొత్తం 13 రైతుబజార్లు ఉండగా వాటిలో ములగాడ, పెందుర్తి రైతుబజార్ల ఎస్టేట్ అధికారులు అక్కడ విధుల్లో చేరి పది నెలలే కావడంతో వారిని బదిలీ నుంచి మినహాయించారు. ఎంవీపీ కాలనీ, సీతమ్మధార, కంచరపాలెం, గోపాలపట్నం, నరసింహనగర్, మధురవాడ, పెదవాల్తేరు, స్టీల్‌ప్లాంటు, గాజువాక, పెదగంట్యాడ, మర్రిపాలెం ఈఓలను బదిలీ చేయాలని నిర్ణయించారు. పెద్దబజార్లలో పనిచేసిన వారిని ఈసారి చిన్న బజార్లకు పంపించి, అక్కడి వారిని పెద్ద బజార్లకు వేయాలని అధికారులు భావిస్తున్నారు. ఇదే విషయాన్ని ఈఓలకు కూడా చెప్పినట్టు సమాచారం. అయితే గతంలో ఇలాగే పెద్దబజార్లుగా గుర్తింపుపొందిన ఎంవీపీ కాలనీ, సీతమ్మధారలకు ఈఓలుగా వెళ్లిన కొందరు సమన్వయం చేసుకోలేక, ఫిర్యాదులు అధికం కావడంతో స్వచ్ఛందంగా పక్కకు తప్పుకున్నారు. దాంతో వేరే వారికి బాధ్యతలు అప్పగించారు. ఈసారి అలా కాకుండా అందరినీ సమన్వయంతో కలుపుకొని ... మిగతా 6వ పేజీలో

గన్‌మెన్ లేకుండానే...

» పోలీస్ బదిలీల్లో తన సిఫారసులను పట్టించుకోలేదనే అసంతృప్తితో గత నెల గన్‌మెన్‌ను వెనక్కిపంపిన పెందుర్తి ఎమ్మెల్యే
» పునరుద్ధరించేందుకు యత్నించని అధికారులు
» జనసేన నాయకుల అసంతృప్తి

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)



పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్ బాబు గన్‌మెన్ లేకుండానే తిరుగుతున్నారు. ఆమధ్య జరిగిన పోలీస్ బదిలీల్లో తన సిఫారసులను పట్టించుకోలేదనే అసంతృప్తితో ఆయన గన్‌మెన్‌ను వెనక్కి పంపేశారు. బదిలీలకు సంబంధించి పంచకర్ల నుంచి పోలీసు అధికారులు మూడు సిఫారసు లేఖలు తీసుకున్నారు. నియోజకవర్గంలో పెందుర్తి, సబ్బవరం, పరవాడ స్టేషన్లకు ఒక్కో పేరు చొప్పున ఆయన మూడు పేర్లు ఇచ్చారు. అందులో ఒక్కటి కూడా ఉన్నతాధికారులు ఆమోదించలేదు. వేరే వారిని సీఐలుగా నియమించారు. ఇది అవమానంగా భావించిన పంచకర్ల ... మిగతా 6వ పేజీలో

నిధులన్నీ కొందరికేనా?

స్టాండింగ్ కమిటీ సమావేశంలో సభ్యుల ఆగ్రహం

» నిధుల విడుదలపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్
» వాడీవేడిగా సమావేశం
» 'ఆడుదాం ఆంధ్ర' ప్రారంభ, ముగింపు వేడుకల బిల్లుల చెల్లింపుపై అభ్యంతరం
» ఆధారాలు సమర్పించాల్సిందిగా కోరుతూ పక్కనపెట్టిన అంశాన్ని మళ్లీ ఎజెండాలో చేర్చడమేమిటంటూ నిలదీత
» తమను అధికారులు పట్టించుకోవడం లేదంటూ ఫిర్యాదు



స్థాయీ సంఘం సమావేశంలో పాల్గొన్న మేయర్, సభ్యులు

వెంకోజీపాలెం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మేయర్ గొలగాని హరివెంకటకుమారి అధ్యక్షతన శుక్రవారం జీవీఎంసీ పాత సమావేశ మందిరంలో జరిగిన స్థాయీ సంఘం సమావేశం గతానికి భిన్నంగా వాడీవేడిగా సాగింది. జోన్-6లో 'ఆడుదాం ఆంధ్రా' ప్రారంభం, ముగింపు వేడుకలకు చేసిన ఖర్చుల చెల్లింపు గురించి ఎజెండాలో పేర్కొన్న మొదటి అంశం చదువుతుండగానే సభ్యులు పలువురు తమ వ్యతిరేకత వ్యక్తంచేశారు. గత సమావేశంలో ఇదే అంశాన్ని వాయిదా వేశామని, ఆధారాలు సమర్పించాలని కోరినప్పటికీ, అలాంటివేమీ లేకుండా తిరిగి ఎజెండాలో చేర్చడమేమిటని ప్రశ్నించారు. అంతేగాకుండా స్టాండింగ్ కమిటీ ఎజెండాను ఒకరోజు ముందు ఇవ్వడాన్ని తప్పుబట్టారు. తమను కార్యదర్శి పి.వి.రమణ పట్టించుకోవడం లేదని మేయర్‌కు ... మిగతా 6వ పేజీలో

మునిసిపల్ టీచర్ల పదోన్నతుల కౌన్సెలింగ్ నేటికి వాయిదా

విశాఖపట్నం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ పరిధిలోని ఉన్నత పాఠశాలల్లో స్కూల్ అసిస్టెంట్ ఖాళీల భర్తీకి శుక్రవారం నిర్వహించాల్సిన పదోన్నతుల కౌన్సెలింగ్ శనివారానికి వాయిదా వేశారు. ఫిజికల్ సైన్స్‌లో ఐదు, ఎలిమెంటరీ పాఠశాలల ప్రధానోపాధ్యాయ పోస్టులు ఐదు, సోషల్ స్టడీస్‌లో ఒకటి..మొత్తం 11 ఖాళీలు ఉన్నాయి. ఈ మేరకు సీనియారిటీ ప్రకారం పదోన్నతులు కల్పించాలి. అయితే రోస్టర్‌కు సంబంధించిన సమాచారం సిద్ధం కాకపోవడంతో కౌన్సెలింగ్‌ను శనివారానికి వాయిదా వేశారు. అన్నిరకాల ఇబ్బందులు తొలగించి పదోన్నతులు కల్పిస్తామని డీఈవో ఎస్.ప్రేమ్‌కుమార్ తెలిపారు.



హైజాక్‌ను అడ్డుకుంటున్న దృశ్యం

విమానాశ్రయంలో యాంటీ హైజాక్ ఎక్సర్‌సైజ్

విశాఖపట్నం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం విమానాశ్రయంలో తూర్పు నౌకాదళం అధికారులు యాంటీ హైజాక్ ఎక్సర్‌సైజ్‌ను నిర్వహించారు. విమానాశ్రయంలో అనుకోకుండా హైజాకింగ్ వంటి ఘటనలు సంభవిస్తే సంబంధిత సిబ్బంది ఎంత అప్రమత్తంగా ఉన్నారో తెలుసుకోవడానికి, లోపాలు ఉంటే సరిచేసుకోవడానికి దీనిని నిర్వహించినట్టు తూర్పు నౌకాదళం తెలిపింది. ఈ కార్యక్రమం బుధవారం నిర్వహించామని, అందులో సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్, నేషనల్ సెక్యూరిటీ గార్డ్, ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా, రాష్ట్ర ప్రభుత్వ సంస్థలు పాల్గొన్నాయి.

మాతృ శాఖకు పర్యాటక శాఖ ఆర్‌డీ

» ఈఈ రమణకే అన్ని అదనపు బాధ్యతలు
» పర్యాటక శాఖకు, ఏపీటీడీసీకి మధ్య ప్రచ్ఛన్నయుద్ధం

విశాఖపట్నం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఏపీ పర్యాటక అభివృద్ధి సంస్థకు విశాఖపట్నంలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా, ఏపీ టూరిజం అథారిటీకి రీజనల్ డైరెక్టర్‌గా, ఏపీటీడీసీ డివిజనల్ మేనేజర్‌గా అదనపుగా బాధ్యతలు నిర్వహిస్తున్న శ్రీనివాస పాణి మాతృశాఖకు వెళ్లిపోయారు. ఆయన రాష్ట్ర ఆడిట్ శాఖలో అసిస్టెంట్ ఆడిట్ ఆఫీసర్ హోదాలో పనిచేస్తూ డిప్యుటేషన్‌పై ఏపీటీడీసీకి వచ్చారు. గత మూడేళ్లుగా ఆయన ఇక్కడ పనిచేస్తున్నారు. ఇటీవల జిల్లాలో పర్యాటక శాఖ అధికారులకు, ఏపీటీడీసీ అధికారులకు మధ్య ప్రచ్ఛన్న యుద్ధం జరుగుతోంది. ఈ క్రమంలో శ్రీనివాస పాణి ఇక్కడ కొనసాగడం ఇష్టం లేక మాతృశాఖకు పంపించేయాలని ప్రభుత్వానికి లేఖ రాశారు. అక్కడి నుంచి ఆమోదం రావడంతో మూడు రోజుల క్రితం వెళ్లిపోయారు.

అన్ని బాధ్యతలు ఆయనకే

విశాఖపట్నంలో పర్యాటక శాఖ పనులన్నీ గత కొన్నేళ్లుగా ఎగ్జిక్యూటివ్ ... మిగతా 6వ పేజీలో



ప్రారంభానికి సిద్ధంగా తిరు నామాలు

సింహాచలం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : సింహగిరిపై ఈశాన్య దిక్కున వైకుంఠనారాయణుడి ఆలయానికి చేరువగా ఏర్పాటు చేసిన తిరునామాలు ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయి. 2014లో హుద్‌హుద్ తుఫాన్ ధాటికి సింహగిరి ఘాట్‌రోడ్‌లో ఉన్న శంఖు, చక్ర, తిరునామాలు కూలిపోయాయి. ఈనేపథ్యంలో నగరంలోని ప్రముఖ వ్యాపార సంస్థ జీఆర్‌టీ జ్యువెలరీ ముందుకు వచ్చి సుమారు రూ. 80 లక్షల ఆర్థిక సహాయం చేయడంతో నూతనంగా శంఖు, చక్ర, తిరు నామాలను ఏర్పాటు చేశారు. వీటిని త్వరలోనే ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, పాలకమండలి అనువంశిక ధర్మకర్త పూసపాటి అశోక్‌గజపతిరాజు చేతుల మీదుగా ప్రారంభించేందుకు ఈఓ త్రినాథరావు ఏర్పాట్లు చేస్తున్నారు.

చిప్పాడలో సుత్తమ్మ తల్లి బాలాలయం

భీమునిపట్నం (రూరల్), నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చిప్పాడ గ్రామంలో ఉన్న సుత్తమ్మ తల్లి దేవాలయానికి అనుబంధంగా బాలాలయం నిర్మించనున్నారు. ఈమేరకు గ్రామస్తులు శుక్రవారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ రమావతి మాట్లాడుతూ బాలాలయం నిర్మాణం పూర్తయితే మరింత మంది భక్తులు దేవాలయాన్ని సందర్శించే అవకాశం ఉంటుందన్నారు. ఆలయ నిర్మాణాన్ని మూడు నెలల్లో పూర్తి చేయనున్నట్టు తెలిపారు.

శారదా పీఠం భూముల స్వాధీనం హర్షణీయం

భీమునిపట్నం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : పెందుర్తి శారదా పీఠానికి కొత్తవలస కొండపై వైసీపీ ప్రభుత్వం కేటాయించిన భూములను కూటమి ప్రభుత్వం రద్దు చేసి, స్వాధీనం చేసుకోవడం హర్షణీయమని విదసం సంస్థ కన్వీనరు డాక్టర్ బి.వెంకట్రావు అన్నారు. శుక్రవారం వారు ప్రభుత్వం స్వాధీనం చేసుకున్న భూములను సందర్శించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం శారదా పీఠానికి అక్రమంగా కట్టబెట్టిన సుమారు రూ. 225 కోట్లు విలువ చేసే ప్రభుత్వ భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవడం వెనుక విదసం పోరాటం ఉందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా వేల కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ, అసైన్డ్, డీపట్టా, దళితుల భూములను వైసీపీ పెద్దలు అధికారం అడ్డం పెట్టుకుని నొక్కేశారని ఆరోపించారు. వాటన్నింటిపై సీఎం సమగ్ర విచారణ జరిపించాలని కోరారు. అలాగే విశాఖలో దసపల్లా భూములను తిరిగి 22ఏ జాబితాలో చేర్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో విదసం సభ్యులు ఓంకార్, భాస్కరరావు,ఈశ్వరరావు, మహేశ్ పాల్గొన్నారు.

పంచాయతీలకు నిధుల విడుదలపై హర్షం

పద్మనాభం (రూరల్), నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల చేయడం పట్ల సర్పంచుల సంఘం రాష్ట్ర కార్యదర్శి గొర్రెపాటి వెంకటలక్ష్మి హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. పంచాయతీలకు పూర్వ వైభవం తీసుకువస్తామని ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం రూ. 250 కోట్లు విడుదల చేయడం ఆనందంగా ఉందన్నారు.

ఒత్తిడిని జయిస్తేనే విజయం

తగరపువలస, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు ఒత్తిడిని జయిస్తేనే విజయం సాధిస్తారని మానసిక వైద్యులు సత్తిబాబు, నారాయణరావు తెలిపారు. శుక్రవారం వారు తగరపువలస అవంతి ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులకు మానసిక ఒత్తిడి, సమస్యలు అన్న అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఒత్తిడి వల్ల మాదక ద్రవ్యాలకు దగ్గరవుతారని, ఒత్తిడి రాకుండా చూసుకోవాలని సూచించారు. మానసిక ప్రశాంతత కోసం యోగాతో పాటు ఆధ్యాత్మిక పుస్తకాలు చదవాలని చెప్పారు. ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ బి. మురళీకృష్ణ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి షరీఫ్, అధ్యాపకులు కనక మహాలక్ష్మి, సంగీత మిత్ర కిరణ్, అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

108 సిబ్బంది నిరసన

పద్మనాభం రూరల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : తమకు బకాయి వేతనాలు చెల్లించాలని మండల పరిషత్ కార్యాలయం వద్ద 108 వాహన సిబ్బంది శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ నాలుగు నెలలుగా వేతనాలు అందకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నామని చెప్పారు. 108 వాహనాల నిర్వహణ బాధ్యతల నుంచి అరబిందో సంస్థ తప్పుకోవడంతో బకాయి వేతనాలు వస్తాయోలేదోనని ఆందోళన చెందుతున్నామన్నారు. ఈ విషయమై ప్రభుత్వం స్పందించాలని కోరారు.ఈ కార్యక్రమంలో సిబ్బంది మధుకుమార్, ఎం. రామునాయుడు, ఎన్. రమణరాజు, ఎం. తిరుపతి పాల్గొన్నారు.

కప్ప స్తంభం ఆదాయం రూ. 6.9 లక్షలు

సింహాచలం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామి ఖజానాకు కప్ప స్తంభం ద్వారా గత నెలలో రూ. 6. 9 లక్షల ఆదాయం సమకూరింది. దేవస్థానం రికార్డుల ప్రకారం గత నెల 27824 మంది కప్ప స్తంభాన్ని ఆలింగనం చేసుకోవడం వల్ల రూ.6,95,600 ఆదాయం లభించింది. ఈమేరకు అధికారులు ఒక ప్రకటన విడుదల చేశారు.

ప్రభుత్వ స్థలాలు ఆక్రమిస్తే చర్యలు

- అధికారులు ఈ విషయమై దృష్టిసారించాలి
- జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్
- భీమిలిలో సుడిగాలి పర్యటన



తిమ్మాపురం జంక్షన్‌లో పర్యటిస్తున్న కమిషనర్ సంపత్‌కుమార్

భీమునిపట్నం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : జోన్ వన్ పరిధిలో ఆక్రమణలు, అక్రమ నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయన్న విమర్శలు ఉన్నాయని, దీనిపై అధికారులు ప్రత్యేక దృష్టిసారించాలని జీవీఎంసీ కమిషనర్ డాక్టర్ పి.సంపత్‌కుమార్ ఆదేశించారు. శుక్రవారం ఉదయం ఆయన 4వ వార్డు తిమ్మాపురం పరిసర ప్రాంతాల్లో వార్డు కార్పొరేటర్ దౌలపల్లి ఏడుకొండలరావుతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ తన వార్డులో చాలా ఇళ్లకు పన్ను వేయడం లేదని, తగు చర్యలు తీసుకోవాలని కమిషనర్‌ను కోరారు. దీనిపై ఆయన స్పందిస్తూ ఇంటి పన్ను వేసే విషయమై సంబంధిత అధికారులు పరిశీలించి చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా అక్రమ నిర్మాణాలు, ఆక్రమణలపై నిఘా వేయాలని అసిస్టెంట్ టౌన్ ప్లానింగ్ అధికారి రామకృష్ణను ఆదేశించారు. అనంతరం తాగునీటి ఎద్దడి వున్న ప్రాంతాల్లో కమిషనర్ సందర్శించి ఈఎల్ సర్వీసు రిజర్వాయర్ల నిర్మాణానికి, పలు ప్రాంతాల్లో మంచినీటి బోర్లు ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని పర్యవేక్షక ఇంజనీర్ శ్యామ్‌సన్ రాజును ఆదేశించారు. ప్రజలకు మౌలిక వసతుల కల్పనలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని చెప్పారు. వార్డులో వీధి దీపాల సమస్య ఎక్కువగా వుందని, సుమారు 600 వరకూ ఎల్ఈడీ లైట్లు, జంక్షన్‌లలో హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేయాలని కార్పొరేటర్ కోరారు. అలాగే వార్డులో నాలుగు శిథిల తుపాన్ షెల్టర్లు ఉన్నాయనని,వాటిని తొలగించి, కొత్త నిర్మాణాలు చేపట్టాలన్నారు. అక్కడి నుంచి కమిషనర్ కాపులుప్పాడ డంపింగ్ యార్డును సందర్శించి బయో గ్యాస్ ప్లాంట్‌ను పరిశీలించారు. ఈ కార్యక్ర మంలో వార్డు వైసీపీ కార్యదర్శి మేరుగు చిన్నారావు, తదితరులు పాల్గొన్నారు.

వ్యర్థాల తరలింపునకు ర్యాంపు

కొమ్మాది : డంపింగ్ యార్డులోని బయో సీఎన్‌జీ ప్లాంటును మరింత అభివృద్ధి చేయాలని, క్లాప్ వాహనాల ద్వారా వచ్చే వ్యర్థాల తరలింపునకు ప్రత్యేకమైన ర్యాంపు ఏర్పాటు చేయాలని జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన కాపులుప్పాడ డంపింగ్ యార్డును సంద ర్శించారు. ముందుగా యార్డులోని బయోసిఎన్‌జి ప్లాంటును సందర్శించి బయో గ్యాస్ ఉత్పత్తి, తయారీని నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ ప్లాంటుకు రోజూ చేరుతున్న వ్యర్థాలను ప్లాంటు ప్రవేశ ప్రాంతంలో వేయకుండా ప్రత్యేకంగా ఒక పిట్ లీచట్‌ను ఏర్పాటు చేసుకోవాలని నిర్వాహకులకు సూచించారు. వారంలో ప్లాంటు అభివృద్ధికి సంబంధించిన ప్రణాళికను సమర్పించాలని ఆదేశించారు.కంపోస్టు తయారీకి వచ్చిన తడి వ్యర్థాలను బయో గ్యాస్ ప్లాంటుకు తరలించాలని సహాయ వైద్యాధికారి కిశోర్‌ను ఆదేశించారు. ఆయనతో పాటు పర్యవేక్షక ఇంజనీర్ శ్యామ్‌సన్ రాజు, తదితరులు ఉన్నారు.

మధురవాడలో మురుగు నీటి శుద్ధి ప్లాంట్

- రూ. 550 కోట్లతో నిర్మాణం
- ఎమ్మెల్యే గంటా



శిలాఫలకాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

కొమ్మాది, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లగా పాలన సాగిస్తుందని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం ఆయన జీవీఎంసీ 5వ వార్డులో పలు అభివృద్ధి పనులకు కార్పొరేటర్ మొల్లి హేమలతతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మధురవాడలో రూ. 550 కోట్ల మురుగు నీటి శుద్ధి ప్లాంట్ ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. విశాఖ అభివృద్ధిలో మధురవాడ కీలకమని, ప్రణాళికబద్ధమైన ఆలోచనలతో ముందుకు వెళ్లకపోతే ఈ ప్రాంతం ముంబాయిలోని మురికివాడల్లో ఒకటైన ధారావిలా మారే ప్రమాదం ఉందన్నారు. ఇక్కడ ఉన్న 5, 6, 7, 8 వార్డుల్లో 255 అభివృద్ధి పనులకు రూ. 69.20 కోట్లు, మంచినీటి పనులకు మరో రూ. 31.91 కోట్లు ఖర్చు చేస్తున్నామని చెప్పారు. అభివృద్ధి పనుల కోసం భీమిలిలో వీఎంఆర్‌డీఏ 500 ఎకరాలను ల్యాండ్ పూలింగ్ ద్వారా సేకరిస్తుందన్నారు. భోగాపురం ఎయిర్‌పోర్టు అందుబాటులోకి వచ్చాక భీమిలి, మధురవాడ ప్రాంతాలు హైద రాబాద్‌లోని గచ్చిబౌలి, మాదాపూర్, హైటెక్ సిటీ స్థాయిలో అభివృద్ధి చెందుతాయని చెప్పారు. మండలాల్లో హాజరవుతున్నట్టుగానే ఇకపై సిటీలో ప్రతి సోమవారం జరిగే గ్రీవెన్స్‌లో పాల్గొంటానని తెలిపారు. వార్డుల్లో పారిశుధ్యం, తాగునీటి సరఫరా, రోడ్ల సమస్యలను తెలుసుకోవడానికి క్రమం తప్పకుండా తనిఖీలు చేపడతానన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు మొల్లి లక్ష్మణరావు, పిళ్లా వెంకట్రావు, వాండ్రాసి అప్పలరాజు, బోయి శ్రీను, పిళ్లా నరసింగరావు, ఎన్ఎన్ నాయుడు, లొడగల జానకీరామ్, వైకుంఠరావు, కురుమోజు గోవింద్, తదితరులు పాల్గొన్నారు.



చిట్టివలసలో పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

ధరల పెరుగుదలపై ప్రజా చైతన్య యాత్ర

తగరపువలస, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : పెరుగుతున్న నిత్యావసర సరకుల ధరలు, స్టీల్‌ప్లాంటు ప్రైవేటీకరణ వంటి సమస్యల పరిష్కారం కోసం ఈనెల 15 వరకు గ్రామాల్లో ప్రజా చైతన్య యాత్ర చేపట్టనున్నట్టు సీపీఎం నాయకులు తెలిపారు. శుక్రవారం వారు చిట్టివలసలో ప్రజా చైతన్య యాత్ర పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జోన్ కార్యదర్శి మూర్తి, నాయకులు ఆర్. నరసింగరావు, ఎస్. అప్పలనాయుడు, వి. నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

అన్ని పంచాయతీల్లోనూ సంపద తయారీ కేంద్రాలు



మూలకుద్దులో సంపద తయారీ కేంద్రాన్ని సందర్శించిన అధికారులు

భీమునిపట్నం (రూరల్), నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అన్ని పంచాయతీల్లోనూ చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని ఎంపీడీఓ హనుమంతరావు తెలిపారు. శుక్రవారం ఆయన రేఖవానిపాలెం, మూలకుద్దు పంచాయతీల్లోని కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సంపద తయారీ కేంద్రాల్లో కంపోస్టు యార్డులు ఏర్పాటు చేసి, ఎరువు విక్రయించడం వల్ల పంచాయతీలకు ఆదాయం వస్తుందన్నారు. ఎప్పటికప్పుడు చెత్త తొలగించడం వల్ల గ్రామాలు కూడా పరిశుభ్రంగా ఉంటాయని చెప్పారు.

విలువలతో కూడిన విద్య అవసరం

సాగర్‌నగర్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు విలువలతో కూడిన విద్య బోధించాలని మాపిల్ సాఫ్ట్‌వేర్ ప్రైవేట్ లిమిటెడ్ సీఈఓ జీఎస్ శివకుమార్ అన్నారు. రుషికొండ గాయత్రి విద్యా పరిషత్ డిగ్రీ, పిజి ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం ఎంవీపీ కాలనీ గాయత్రి విద్యా పరిషత్ డిగ్రీ విద్యార్థుల ఫ్రెషర్స్ డే వేడుకలు నిర్వహించారు.

రైతుబజార్ల సిబ్బందికి బదిలీలు

... 5వ పేజీ తరువాయి

వెళ్లే వారికే అవకాశం కల్పించాలని రైతుబజార్ల వినియోగదారుల సంఘాలు సూచిస్తున్నారు. రోజూ కనీసం పదికి తక్కువ లేకుండా ఫిర్యాదులు వస్తాయని, సహనంతో సమాధానం చెబుతూ, గొడవలు జరగకుండా సర్దిచెప్పే సమర్థత కలిగిన వారికే అవకాశం ఇవ్వాలని కోరుతున్నారు. ఎస్టేట్ అధికారుల బదిలీలు పూర్తయిన తరువాత సహాయకుల బదిలీలు చేస్తారని అంటున్నారు. అయితే వారు దీనిని వ్యతిరేకిస్తున్నారు. పిల్లల చదువులను దృష్టిలో ఉంచుకొని ఏప్రిల్‌లో బదిలీలు చేపట్టాలని కోరుతున్నారు. రోజూ ఉదయం ఐదు గంటలకే విధులకు హాజరు కావలసి ఉంటుందని, అందుకని పనిచేస్తున్న బజార్లకు దగ్గరలో పిల్లలను పాఠశాలల్లో చేర్పించామని, ఇప్పుడు దూరప్రాంతాలకు బదిలీ చేస్తే ఇబ్బంది అవుతుందని అంటున్నారు. ఏదేమైనా రైతుబజార్లలో దుకాణాల కేటాయింపు, బదిలీల వ్యవహారంపై రకరకాల ఊహాగానాలు ప్రచారం అవుతున్న నేపథ్యంలో పూర్తి పారదర్శకంగా నిర్వహించాలని అంతా కోరుకుంటున్నారు. అధికారులు పెట్టిన ఫైల్‌ను జాయింట్ కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలించి నిర్ణయం తీసుకోవాలని సూచిస్తున్నారు.

మాతృ శాఖకు పర్యాటక శాఖ ఆర్‌డీ

... 5వ పేజీ తరువాయి

ఇంజనీర్ రమణ ఆధ్వర్యంలోనే సాగుతున్నాయి. రుషికొండపై రూ.500 కోట్ల విలువైన భవనం పనులు కూడా ఆయన పర్యవేక్షణలోనే జరిగాయి. ఉమ్మడి విశాఖ జిల్లాలో పర్యాటక శాఖ రిసార్ట్స్ ఆధునికీకరణ, లంబసింగి, అరకులోయ, అనంతగిరిలలో రిసార్ట్స్ పనులు కూడా ఆయనే చూస్తున్నారు. పర్యాటక సీజన్ ప్రారంభమై నెల రోజులైనా ఏవీ అందుబాటులోకి రాలేదు. ఇంకా మరమ్మతులతోనే నడుస్తున్నాయి. ఇప్పుడు అదే అధికారికి రీజనల్ డైరెక్టర్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, డివిజనల్ మేనేజర్ పోస్టులు అదనపు బాధ్యతల కింద అప్పగించారు. సిరిపురంలోని వీఎంఆర్‌డీఏ ఉద్యోగ భవన్‌లో ఉన్న ఆయన కార్యాలయం రెండు రోజుల నుంచి కిటకిటలాడుతోంది. సందర్శకులు కూర్చొనేందుకు కుర్చీలు కూడా దొరకడం లేదు.

భవన నిర్మాణ కార్మికులను ఆదుకోవాలి : సీపీఐ

తగరపువలస, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : భవన నిర్మాణ కార్మికులకు ప్రభుత్వం ఉపాధి కల్పించి, ఆదుకో వాలని సీపీఐ నాయకులు కోరారు. శుక్రవారం వారు తగరపువలసలో భవన నిర్మాణ కార్మికులకు సంబంధించి సమస్యలపై కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఇసుక కొరత వల్ల భవన నిర్మాణాలు జరగడం లేదని, దీంతో కార్మికులకు పనులు ఉండడం లేదని చెప్పారు. ఇసుక తవ్వకాలను ప్రైవేటు ఏజెన్సీలకు ఇవ్వకుండా నిషేధించాలని, ప్రభుత్వమే ర్యాంపులను నిర్వహించాలని, ఇసుకపై అన్ని రకాల పన్నులు ఎత్తివేయాలని, భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈమేరకు ఈనెల 11న నగరంలోని జీవీఎంసీ గాంధీ విగ్రహం ఎదుట ఆందోళన చేపట్టనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు మోర అప్పలరాజు, కానూరి రాంబాబు, కొండపు ఈశ్వరరావు, చిల్ల రామ్‌పైడి, గోవింద పాల్గొన్నారు.

'ఆలయ భూమి విక్రయంపై విచారణ జరపాలి'



ఆలయ భూమి వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు

కొమ్మాది, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : కొమ్మాదిలోని రామాలయం భూమని దొంగపత్రాలు సృష్టించి విక్రయించిన వారిని కఠినంగా శిక్షించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మురిపిళ్ల పైడిరాజు డిమాండ్ చేశారు. శుక్రవారం కొమ్మాది గ్రామస్తులు అమ్మకానికి గురైన భూమి వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూ రికార్డుల్లో సదరు భూమి ఆలయానికి చెందినదిగా ఉందని, దానికి గత నెల 29న పెదగంట్యాడ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేయించారన్నారు. ఈ విషయమై కలెక్టర్‌తో పాటు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లినా స్పందన లేకపోవడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ ఏరియా కార్యదర్శి వి. సత్యనారాయణ, నాయకులు సియ్యాద్రి పైడిరాజు, కొమ్మాది గ్రామ టీడీపీ, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

అప్పన్నకు వైభవంగా ఆర్జిత సేవలు



సింహాచలం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామికి శుక్రవారం పలు ఆర్జిత సేవలను వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాత సేవ, ప్రభాతారాధనలు జరిపారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో శోభాయమానంగా అలంకరించి, ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం నారసింహ సహస్ర నామావళి పఠిస్తూ పవిత్ర తులసీ దళాలతో పూజలు చేశారు. స్వామివారికి మంత్రపుష్పం, కర్పూరనీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు. అనంతరం అదే వేదికపై ఆర్జిత నిత్య కల్యాణం నిర్వహించారు.

జిమ్‌సర్‌లో రేడియాలజీ దినోత్సవం

ఎండాడ, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ రీసెర్చ్ (జిమ్‌సర్)లో శుక్రవారం అంతర్జాతీయ రేడియాలజీ దినోత్సవం నిర్వహించారు. జిమ్‌సర్ రేడియాలజీ విభాగం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జిమ్‌సర్ ప్రో వైస్ ఛాన్సలర్ డాక్టర్ బి. గీతాంజలి మాట్లాడుతూ గీతం ఆసుపత్రిలో రోగులకు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం ఉన్న రేడియాలజీ పరికరాలు వినియోగించి చికిత్స అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో రేడియాలజీ విభాగాధిపతి డాక్టర్ వి. సురేశ్, జిమ్‌సర్ డీన్ డాక్టర్ ఎస్పీ రావు, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ వసంత కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వెంకటాపురంలో రీసర్వే గ్రామసభ

పద్మనాభం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వెంకటాపురంలో రీసర్వేపై శుక్రవారం గ్రామసభ నిర్వహించారు. పేరు మార్పునకు, విస్తీర్ణంలో సవరణకు, ఇద్దరు వ్యక్తులకు ఒకే ఎఫ్ఎంబీ మ్యాపులు వంటి అభ్యంతరాలపై 71 దరఖాస్తులు వచ్చాయి. ఈ సందర్భంగా తహసీల్దార్ కె. ఆనందరావు మాట్లాడుతూ రీసర్వే అనంతరం వెలువడిన జాబితాను పరిశీలించి రైతులు తమ అభ్యంతరాలను లిఖిత పూర్వకంగా గ్రామసభలో దరఖాస్తు చేస్తే వాటిని పరిశీలించి సవరణలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రీసర్వే డీటీ వరలక్ష్మి, ఇతర రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

జోరుగా టీడీపీ సభ్యత్వాల నమోదు

సింహాచలం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 98వ వార్డులో కార్పొరేటర్ పివి నరసింహం సారథ్యంలో టీడీపీ సభ్యత్వాల నమోదు జోరుగా సాగుతోంది. శుక్రవారం సింహగిరి వర్తక సంఘంలోని పలువురితో వార్డు టీడీపీ అధ్యక్షుడు పంచదార్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో సభ్యత్వాల నమోదు చేపట్టారు.



సమావేశంలో మాట్లాడుతున్న వీఎంఆర్డీయే కార్యదర్శి రమేశ్

ప్లాసిక్ రహితంగా కైలాసగిరి

విశాలాక్షినగర్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : కైలాసగిరిని ప్లాస్టిక్ రహితంగా మార్చి మరింత సుందరంగా, పరిశుభ్రంగా ఉంచేందుకు కొండపై ఉన్న వ్యాపారులు సహకరించాలని వీఎంఆర్డీయే జాయింట్ కమిషనర్, సెక్రటరీ కొమ్మి రమేశ్ సూచించారు. శుక్రవారం ఆయన వీఎంఆర్డీయే సమావేశ మందిరంలో కైలాసగిరి కొండపై ఉన్న వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కొండపై వ్యాపారం చేస్తున్న వారు వ్యక్తిగత వాహనాలను నిర్దేశించిన స్థలాల్లో పార్కింగ్ చేసినట్లయితే సందర్శకులకు ఇబ్బంది కలగకుండా ఉంటుందన్నారు. వ్యాపారులు తమకు కేటాయించిన స్థలాల్లో మాత్రమే వ్యాపారాలు నిర్వహించుకోవాలని, అద్దె బకాయిలను ప్రతి నెల 5వ తేదీలోగా చెల్లించాలని చెప్పారు. ఈ సమావేశంలో ఇన్‌చార్జి డీఎఫ్‌వో శివానీ, ఈఈ రాజు, ఇంజనీరింగ్ అధికారులు మోహనరావు, శంకర్రావు, ఏవో వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన సదస్సు



సదస్సులో మాట్లాడుతున్న మేజిస్ట్రేట్ సౌజన్య

భీమునిపట్నం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు చిన్నతనం నుంచే చట్టాల గురించి తెలుసుకోవాలని భీమిలి ఒకటవ మెట్రోపాలిటన్ కోర్టు మేజిస్ట్రేట్ డి. సౌజన్య అన్నారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మండల లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు ర్యాగింగ్‌కు పాల్పడకూడదని, తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు మంచిపేరు తీసుకువచ్చేలా క్రమశిక్షణతో చదువుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు పార్వతీశం, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

98వ వార్డులో రూ. 77 లక్షలతో అభివృద్ధి పనులు

సింహాచలం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 98వ వార్డులో రూ. 77 లక్షలతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు స్థాయీ సంఘం ఆమోదం తెలిపింది. శుక్రవారం జరిగిన స్థాయీ సంఘ సమావేశంలో కార్పొరేటర్ నరసింహం తాను గుర్తించిన పలు పనులను సభ్యుల ముందుంచారు. ప్రధానంగా తొలిపావంచా నుంచి పాత అడివివరం వరకు చేపట్టిన బీఆర్‌టీఎస్ సింహాచలం కారిడార్ నిర్మాణంలో దెబ్బతిన్న అప్రోచ్ రోడ్ల నిర్మాణం, గాంధీనగర్, తదితర ప్రాంతాల్లో సీసీ కాలువలు, రోడ్ల నిర్మాణాలు చేపట్టాలని కోరగా సభ్యులు ఆమోదించారు.

పునాదికే రూ.10 కోట్లా!?

... 5వ పేజీ తరువాయి

పట్టించుకోలేదు. కాగా పునాదుల కోసం తవ్విన గొయ్యిని సగం వరకు కాంక్రీట్‌తో కప్పేసి అక్కడ నుంచి భవన నిర్మాణానికి పిల్లర్లు వేశారు. భూగర్భ జల శాఖ మంజూరుచేసిన రూ.10 కోట్లు అక్కడ వరకే సరిపోయాయంటూ చేతులెత్తేశారు. ప్రభుత్వ పెద్దల దన్నుతో అప్పటి అధికారులు ఇష్టానుసారంగా నిధులు ఖర్చు చేశారని సిబ్బంది వ్యాఖ్యానిస్తున్నారు. ఈ వ్యవహారంలో కొందరు అధికారులు భారీగా సొమ్ములు తిన్నారనే ఆరోపణలు ఉన్నాయి.

సుజల స్రవంతి నిధుల నుంచి రూ. 5.5 కోట్లు కేటాయింపు

భూగర్భ జల శాఖ ఇచ్చిన రూ.10 కోట్లు ఖర్చు అయిపోవడంతో రెగ్యులర్ జల వనరుల శాఖ అధికారులు భవన నిర్మాణం నుంచి తప్పుకున్నారు. భవనం ఎంత వరకు వచ్చిందని భూగర్భ జల శాఖ అధికారులు ప్రశ్నించడంతో జల వనరుల శాఖ ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని ముందుగా ప్రతిపాదించిన మూడు అంతస్థుల భవనం నిర్మించి ఇస్తామని చెప్పి, ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టు నుంచి రూ. 5.5 కోట్లు మంజూరుచేశారు. దీంతో మరోసారి టెండర్లు పిలిచి సెల్లార్, స్టిల్ట్, ఫస్ట్ ఫ్లోర్ నిర్మాణాలు చేపట్టారు. మూడు స్లాబ్‌లు వేశారు. ఈలోగా కేటాయించిన నిధులు అయిపోయాయి. అయితే మంజూరుచేసిన రూ.5.5 కోట్లు నిధులు విడుదలకు 2024-25 ఓటాన్ అకౌంట్‌లో పొందుపరిచినా ఇంతవరకు పైసా విడుదల కాలేదు. ఈలోగా ఎన్నికలు వచ్చి కొత్త ప్రభుత్వం అధికారంలోకి రావడంతో నిధులు విడుదలకాలేదు. సుమారు ఎనిమిది నెలల నుంచి భవనం పనులు నిలిచిపోయాయి. మిగిలిన పనులు పూర్తిచేయడానికి మరో రూ.కోటి, ఫర్నీచర్, ఇతరత్రా సదుపాయాలకు మరో రూ.రెండు కోట్లు అవసరమని భావిస్తున్నారు. గత ప్రభుత్వంలో జల వనరుల శాఖ అధికారులు బాధ్యతారాహిత్యమే ఇందుకు కారణమనే విమర్శలు వినిపిస్తున్నాయి. భవన నిర్మాణ ప్రతిపాదనల్లో మార్పు, పునాదులకు రూ.10 కోట్లు ఖర్చు పెట్టడంపై విచారణ చేపట్టాలని జల వనరుల శాఖలో పలువురు డిమాండ్ చేస్తున్నారు. అదే సమయంలో భవనం పూర్తిచేసి వినియోగంలోకి తీసుకురావాలని కోరుతున్నారు.

నిధులన్నీ కొందరికేనా?

... 5వ పేజీ తరువాయి

ఫిర్యాదు చేశారు. తాము ఎజెండాలో చేర్చాలని ఇచ్చిన విజ్ఞప్తులను పక్కనపెట్టి ఎవరో ఇచ్చిన వాటిని చేర్చడం ఏమిటంటూ నిలదీశారు. 96వ వార్డు కార్పొరేటర్, టీడీపీ ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాసరావు, 76వ వార్డు కార్పొరేటర్ గంధం శ్రీనివాసరావు వార్డులకే కోట్లాది రూపాయలు పనులు మంజూరుచేయడం సరికాదని మరికొందరు అసంతృప్తి వ్యక్తంచేశారు. స్టాండింగ్ కమిటీ సభ్యులకు కనీస గౌరవం లేదని గల్లా పోలిపల్లి ఆవేదన వ్యక్తంచేశారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఆ నలుగురు దోచుకున్నట్టే...ఇప్పుడు మరో నలుగురు దోచుకుంటుంటే చూస్తూ ఊరుకోవాలా?...అని ప్రశ్నించారు. ఏఏ వార్డుకు ఎంతెంత నిధులు ఇచ్చారో శ్వేతపత్రం విడుదల చేయాలని మేయర్‌ను కోరారు. స్టాండింగ్ కమిటీ సభ్యులమైనా కూడా ఎలాంటి అధికారాలు లేకుండా పోయాయని, ఇతర కార్పొరేటర్‌లకు, ప్రజలకు కూడా సమాధానం చెప్పలేకపోతున్నామని వాపోయారు. కాగా జీవీఎంసీ పరిధిలో పలు అభివృద్ధి పనులు చేపట్టేందుకు స్థాయీ సంఘం ఆమోదం తెలిపినట్టు మేయర్ గొలగాని హరివెంకటకుమారి శుక్రవారం సాయంత్రం ఒక ప్రకటన విడుదల చేశారు. ఎజెండాలో 71 అంశాలు పొందుపరచగా, వాటిపై సభ్యులు చర్చించిన పిదప 11 అంశాలు వాయిదా వేశామని, మిగిలిన 60 అంశాలు ఆమోదం పొందాయని పేర్కొన్నారు. ఇందులో ఇంజనీరింగ్ విభాగానికి సంబంధించిన సుమారు రూ.17.5 కోట్లు అభివృద్ధి పనులు ఉన్నాయన్నారు. సమావేశంలో జీవీఎంసీ కార్యదర్శి బి.వి.రమణ, ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ సి.వాసుదేవరెడ్డి, ఆరో జోన్ కమిషనర్ బి.ఆర్.ఎస్.శేషాద్రి, కార్యనిర్వాహక ఇంజనీర్లు తదితరులు పాల్గొన్నారు.

గన్‌మెన్ లేకుండానే...

... 5వ పేజీ తరువాయి

వెంటనే తనకు గన్‌మెన్ అవసరం లేదని చెప్పి వెనక్కి పంపించేశారు. ఇది జరిగి సుమారు రెండు నెలలు అవుతోంది. కూటమిలో మిత్రపక్షాల మధ్య ఘర్షణ వాతావరణం ఉండకూడదని ఆయన బదిలీల వ్యవహారంపై మౌనం దాలిస్తే గన్‌మెన్‌ను పునరుద్ధరించకుండా పోలీసు పెద్దలు చోద్యం చూస్తున్నారని జనసేన నాయకులు ఆరోపిస్తున్నారు. సీనియర్ అయిన తమ నాయకుని పట్ల అధికారులు వ్యవహరిస్తున్న తీరు సమంజసంగా లేదంటున్నారు.

తీరం పటిష్ఠం

... 5వ పేజీ తరువాయి

నివసించే వారికి రిస్క్ మేనేజ్‌మెంట్‌లో శిక్షణ ఇచ్చి, అండగా ఉంటారు.

» ఎక్కడైనా తీరం కోతకు గురైతే వెంటనే స్పందించి తగిన నిర్మాణాలు చేపడతారు.

ఎస్‌డీఎంఏకి ప్రతిపాదనలు పంపించాం

\- భవానీ శంకర్, చీఫ్ ఇంజనీర్, వీఎంఆర్‌డీఏ

నేషనల్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ నిధులు మంజూరుచేస్తుంది. అయితే ఈ ప్రతిపాదనలు స్టేట్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ (ఎస్‌డీఎంఏ) నుంచి వెళ్లాలి. అందుకని అమరావతిలో ఎస్‌డీఎంఏకి మొత్తం నివేదిక పంపించాం. త్వరలోనే దీనికి నిధులు వచ్చే అవకాశం ఉంది.

☛ సంక్షిప్తంగా..

ప్రజలపై ఆర్థిక భారం మోపడం తగదు : సీపీఎం


ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేస్తున్న సీపీఎం నేతలు

ఆరిలోవ, నవంబరు 8 : (ఆంధ్రజ్యోతి) : పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలను అరికట్టాలని, ట్రూ అప్ ఛార్జీల పేరుతో ప్రజల నెత్తిన ఆర్థిక భారం మోపవద్దని డిమాండ్ చేస్తూ సీపీఎం శుక్రవారం ఇంటింటి ప్రచారాన్ని ప్రారంభించారు. వారం రోజుల పాటు ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు ఆ పార్టీ నేతలు చెప్పారు. ఇందులో భాగంగా ఆరిలోవ, బీఎస్ఆర్ నగర్ కాలనీలో ఇంటింటికి వెళ్లి కరపత్రాలను పంచుతూ ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఆర్కేఎస్వీ కుమార్ మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తోందని విమర్శించారు. ప్రభుత్వ రంగ సంస్థలను కారు చౌకగా కార్పొరేట్ కంపెనీలకు కట్టబెడుతున్న ఎన్డీఏ ప్రభుత్వం ప్రజల సంక్షేమాన్ని గాలికొదిలేసిందని మండిపడ్డారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలను వ్యతిరేకిస్తూ ఇంటింటికీ వెళ్లి విస్తృత ప్రచారం చేయనున్నట్టు చెప్పారు. ఈ క్రమంలో ఈ నెల 14న తహసీల్దార్ కార్యాలయాల ఎదుట ధర్నాలు నిర్వహించనున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నేతల నరేంద్రకుమార్. డి.నాగరాజు, ఎ.రమణ, సన్యాసమ్మ, లక్ష్మి, పరేష్ బాషా తదితరులు పాల్గొన్నారు.

విధుల నుంచి తొలగింపుపై సెవెన్‌హిల్స్ సిబ్బంది ఆందోళన

రామ్‌నగర్, నవంబరు8 (ఆంధ్రజ్యోతి) : తమను ఉద్యోగాల నుంచి తొలగించడం అన్యాయమని సెవెన్‌హిల్స్ ఆస్పత్రి వద్ద కొందరు ఉద్యోగులు ఆందోళన చేపట్టారు. శుక్రవారంరామ్‌నగర్‌లోని సెవెన్‌హిల్స్ ఆస్పత్రిలో గత 15 ఏళ్లుగా వార్డుబాయ్‌లు, ఆయాలుగా విధులు నిర్వహిస్తున్నామని, ఇప్పుడు ఉద్యోగాల నుంచి తొలగిస్తే మా పరిస్థితి ఏమిటంటూ ఆవేదనవ్యక్తం చేశారు. ఆస్పత్రి యాజమాన్యం వార్డు బాయ్ లను హీనంగా చూస్తోందని ఆరోపించారు. తమను తొలగించి కాంట్రాక్ట్ పద్ధతిలో సిబ్బందిని తీసుకోవడం దారుణమని వాపోయారు. ఆస్పత్రి యాజమాన్యం తమ నిర్ణయాన్ని పునరాలోచించి తక్షణమే తమను విధుల్లోకి తీసుకోవాలని కోరారు.

సినిమా గైడ్

- **అపుడో, ఇప్పుడో, ఎప్పుడో :** కిన్నెర, సంగం, గోకుల్, మౌర్య (గోపాలపట్నం) కన్య కాంప్లెక్స్ (గాజువాక) లిఖిత (శ్రీహరిపురం),
- **ధూం, ధాం :** శారద, మోహిని (గాజువాక)
- **జితేందర్‌రెడ్డి :** శ్రీనరసింహ (గోపాలపట్నం), హెవెన్-3 (గాజువాక)
- **క :** జగదాంబ, శ్రీరామ, ఊర్వశి (కంచరపాలెం), సౌజన్య (గోపాలపట్నం), మోహిని(గాజువాక), గణేష్ (తగరపువలస)
- **లక్కీ భాస్కర్:** మెలోడి, శరత్,కామేశ్వరి, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), శ్రీరాములమ్మ (తగరపువలస)
- **అమరన్ :** శ్రీవెంకటేశ్వర, శ్రీకన్య, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), మోహిని కాంప్లెక్స్‌నటరాజ్-1 (పెందుర్తి), సప్తగిరి (తగరపువలస)
- **బఘీర :** వెంకటేశ్వర, శ్రీకన్య కాంప్లెక్స్ (గాజువాక), సీతారామయ్య (పరవాడ)
- **దేవర :** రమాదేవి, శ్రీకన్య (గాజువాక). తాతా (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 54, టమాటా 34, వంకాయలు (తెలుపు) 34, వంకాయలు (నలుపు) 50, బెండకాయలు 36, పచ్చిమిర్చి 36, కాకరకాయలు 38, బీరకాయలు 30, ఆనపకాయ 26, కాలీఫ్లవర్ 60, క్యాబేజీ 34, క్యారెట్ 62 దొండకాయలు 28, బంగాళదుంపలు 40, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 44, అల్లం (పాతది)60, బరబటి 34, ముల్లంగి 26, నిమ్మకాయలు (కిలో) 76, గోరుచిక్కుడు 40, దోస కాయలు 38, వెల్లుల్లి (పెద్దవి) 290, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 76, పొటల్స్ 42, కీరదోస 28, కాప్సికమ్ 78, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 48, చిలగడదుంపలు 30, కంద 72, దేముడు చిక్కుడు 72, కొండఉసిరి 70, కరివేపాకు (కిలో) 45, కొత్తిమీర (పెద్దకట్ట) 35, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 100, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 45, మామిడి అల్లం 60, బొప్పాయి 40, జామకాయలు (కిలో) 45.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)	
విశాఖపట్నం	550
విజయనగరం	554
శ్రీకాకుళం	554

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	107
ఫారం ధర	123
విత్ స్కిన్	224
స్కిన్‌లెస్	234

సమస్యల నడుమ చదువు సాగేదెలా?

- అంబేడ్కర్ గురుకులం విద్యార్థుల అవస్థలు
- భోజన శాల వద్ద చెత్తకుప్పలతో దుర్గంధం
- కొళాయిలకు హెడ్స్ లేకపోవడంతో చేతులు కడుక్కోవడానికి ఇబ్బందులు
- ఆవరణలో దట్టంగా పెరిగిన పొదలు
- అరకొర వసతుల మధ్య విద్యాభ్యాసం


భోజన శాల సమీపంలో ఇదీ పరిస్థితి


హెడ్స్ లేని కొళాయిలు

ఆరిలోవ నవంబరు 6 : కేంద్ర కారాగారానికి సమీపంలో గల అంబేడ్కర్ గురుకులం సమస్యలకు నిలయంగా మారింది. ఇక్కడ అయిదో తరగతి నుంచి ఇంటర్ వరకూ తరగతులు ఉన్నాయి. సుమారు 500 మంది విద్యాభ్యాసం చేస్తుంటారు. అయితే భోజనశాలకు సమీపంలోనే చెత్తాచెదారాలు ఉండడంతో తీవ్ర దుర్గంధం వెలువడుతుంటుంది. ఈ దుర్వాసనను విద్యార్థులు భరించలేకపోతున్నారు. ఎన్నో నెలల నుంచి ఈ సమస్య ఉన్నా పరిష్కారానికి చర్యలు మాత్రం తీసుకోవడం లేదు. దీన్ని చూసిన తల్లిదండ్రులు పిల్లలకు వ్యాధులు సోకే ప్రమాదం ఉందని ఆందోళనకు గురవుతున్నారు. ఇక్కడ ఉన్న కొళాయిలకు హెడ్స్ లేకపోవడం విద్యార్థులకు ఇబ్బందిగా మారింది. భోజనాలు చేసిన తర్వాత చేయి కడుగుదామన్నా నీరు లేక అవస్థలు పడుతున్నారు. ఇక్కడ ఏర్పాటు చేసిన చిన్న గోలెంలలో ఉన్న నీటిని తీసుకొని చేతులు కడుకుతుంటారు. అయితే ఆ గోలెంలు శుభ్రం చేయకపోవడంతో నాచు పట్టి ఉంటాయి. వాటిల్లో నీటినే విద్యార్థులు వాడుకోవాల్సి రావడం శోచనీయం. కొన్ని కొళాయిలు లీక్ అవుతుండడంతో నీరు వృథాగా పోతుంటుంది.


గురుకులం ఆవరణలో దట్టంగా పెరిగిన పొదలు

ఈ గురుకులం ఆవరణలో తుప్పలు దట్టంగా పెరిగిపోవడంతో పిల్లలు, తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఎప్పుడు ఏ పాము, విష ప్రాణుల వల్ల ప్రమాదం వాటిల్లుతుందోనని గుబులు చెందుతున్నారు. పిచ్చి మొక్కలు పెరగడంతో దోమలు వ్యాప్తి చెంది ఇబ్బందిగా ఉంటోందని విద్యార్థులు వాపోతున్నారు. మరుగుదొడ్లు దారుణంగా ఉన్నాయి. అక్కడ అపరిశుభ్రత నెలకొనడంతో దుర్గంధం వెదజల్లుతుంటుంది.

ఇప్పటికైనా గురుకులంలో వసతుల కల్పనకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

సంప్రదాయబద్ధంగా గౌరీపరమేశ్వరుల ఉత్సవాలు ప్రారంభం


గౌరీ పరమేశ్వర ఉత్సవ విగ్రహాన్ని ఊరేగింపుగా తీసుకొస్తున్న మహిళలు

వెంకోజీపాలెం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : పాతవెంకోజీపాలెంలోని శ్రీసీతారామ సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీగౌరీ పరమేశ్వరుల మహోత్సవాలు శుక్రవారంవైభవంగా ప్రారంభమయ్యాయి. సీతారామాలయంలో 9 రోజుల పాటు ఈ ఉత్సవాలు నిర్వహించనున్నారు. గవర జాతీయులంతా ఇలవేలు గైరమ్మ సంబరాలను సంఘం సభ్యులు, మహిళలు, యువకులు గత దశాబ్ద కాలానికి పైగా ఎంతో భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది కూడా ఈ ఉత్సవాలను ఘనంగా ప్రారంభించారు. సాయంత్రం పాతవెంకోజీపాలెంలోని సీతారామాలయంలో మహిళలంతా ప్రత్యేక పూజలు నిర్వహించి, చెరుకు గడలు,అమ్మవారి పీఠం వంటివి మోసుకుంటూ ఊరేగింపుగా కొత్త వెంకోజిపాలెం భూలోక మాత ఆలయానికి వెళ్లారు. అనంతరం అక్కడ గౌరీ పరమేశ్వరుల ఉత్సవ విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించి, తిరిగి గౌరీపరమేశ్వరులను తలపై మోస్తూ ఊరేగింపుగా సీతారామాలయానికి వచ్చి ప్రతిష్ఠించారు. మేళతాళాలు, వేద మంత్రోచ్ఛరణ మధ్య గైరమ్మతల్లిని తీసుకువచ్చారు. అనంతరం ఆలయంలో గౌరీపరమేశ్వరుల విగ్రహాలను పొందుపరచి ఉత్సవాలను ప్రారంభించారు.

ఈ సందర్భంగా సంఘం అధ్యక్షులు ఆడారి పరదేశినాయుడు మాట్లాడుతూ 9రోజుల ఉత్సవాలలో భాగంగా మహిళలచే దీపాలపూజ, కుంకుమ పూజ, అదే రోజుసాయంత్రం సారె పూజ (గ్రామప్రజలందరు తమవంతుగా అమ్మవారికి కేజీం పావ్ చొప్పున మిఠాయిలు సారిగా తీసుకొని వచ్చి అమ్మవారికి సమర్పించడం), మహా అన్నదానం ఉంటాయని చెప్పారు. వీటితో పాటు ప్రతి రోజు రాత్రి 8 గంటల నుంచి 11 గంటల పలు వినోద కార్యక్రమాలు ఉంటాయని చెప్పారు.

ఈ కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ మళ్ల అప్పలరాజు, సంఘం కార్యవర్గం పీల వెంకట పరదేశినాయుడు, కర్రి శ్రీను, యల్లపు నాగరాజు, ఆడారి శివప్రకాష్, పొలమరశెట్టి త్రినాథ్, కర్రి రఘు, మళ్ల శ్రీను, రాజగిరి సురేష్; మళ్ల కనకరాజు, మళ్ల రవికుమార్, ఇతర కార్యవర్గ సభ్యులు, పెద్దలు, మహిళలు, యువకులు పాల్గొన్నారు.

ఏయూలో కాళీపట్నం రామారావు శత జయంతి



గ్రంథకర్త వెలమల సిమ్మన్నను సత్కరిస్తున్న ఆచార్యులు

వెంకోజీపాలెం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ఏయూ తెలుగుశాధిపతి జర్రా అప్పారావు అధ్యక్షతన కథాప్రపూర్ణ కాళీపట్నం రామారావు శత జయంతి వేడుకలు శుక్రవారం ఏయూ తెలుగు విభాగంలో నిర్వహించారు. ఈ సందర్భంగా రామారావు చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులు అర్పించారు. తెలుగు శాఖ ఆచార్యులు వెలమల సిమ్మన్న రాసిన గ్రంథాన్ని ఈ సందర్భంగా ఏయూ ఆర్ట్స్ అండ్ కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఎ.నరసింహారావు ఆవిష్కరించారు. అనంతరం నరసింహారావు మాట్లాడుతూ తెలుగులో అగ్రేసేని కథకుల్లో కాళీపట్నం రామారావు ఒకరన్నారు. కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు, 2008లో లోకనాయక్ ఫౌండేషన్ అవార్డు, ప్రముఖ నటుడు ఎన్టీ రామారావు జాతీయ పురస్కారం అందుకున్న మహానుభావులు కాళీపట్నం రామారావు అని కొనియాడారు. కార్యక్రమంలో కాళీపట్నం సుబ్బారావు, డాక్టర్ ఈశ్వరమ్మ, డాక్టర్ లావణ్య, జి.శ్రీనుబాబు తదితరులు పాల్గొన్నారు.


రోగులు, వారి సహాయకులతో కిటకిటలాడుతున్న విమ్స్ ఆస్పత్రి

'విమ్స్'కు పెరిగిన రోగుల తాకిడి

ఆరిలోవ, నవంబరు 8 : (ఆంధ్రజ్యోతి) : విమ్స్ ఆస్పత్రికి రోగుల సంఖ్య గణ నీయంగా పెరుగుతోంది. సీజనల్ జ్వరాలు రావడంతో రోగులు అధికంగా వస్తున్నార. వందలాదిమంది రోగులు ఉదయం 10 గంటల నుంచి విమ్స్ ఓపీ విభాగంలో క్యూ కట్టారు. ప్రతీ రోజు సుమారు ఐదు వందల వరకు రోగులు వస్తున్నారు. విశాఖ ప్రాంతం నుంచే కాకుండా విజయనగరం, శ్రీకాకుళం ఒడిశా నుంచి కూడా రోగులు ఈ ఆస్పత్రి వస్తున్నారు. అన్ని రకాల వైద్య సేవలు కూడా అందుబాటులో ఉండడంతో రోగుల సంఖ్య పెరిగింది.

పెద్దల ప్రవర్తన ఆధారంగానే పిల్లల నడవడిక

- పలువురు వక్తలు
- ఘనంగా శ్రీ ప్రకాష్ విద్యానికేతన్ కిడ్స్ డే వేడుకలు


సర్టిఫికెట్ల ప్రదానోత్సవంలో పాల్గొన్న చిన్నారులు, శ్రీప్రకాష్ విద్యానికేతన్ డైరెక్టర్ వాసుప్రకాష్ తదితరులు

సిరిపురం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : పెద్దల ప్రవర్తన ఆధారంగానే పిల్లల నడవడిక ఉంటుందని పలువురు వక్తలు పేర్కొన్నారు. శుక్రవారం సిరిపురం వీఎంఆర్డీఏ చిల్డ్రన్స్ థియేటర్‌లో శ్రీప్రకాష్ విద్యానికేతన్ 'కిడ్స్ డే 2024' వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమినెంట్ ఉపాధ్యాయులు డా.సి.వి.నరసింహం పిల్లలు ఏమీ తెలియని పసికందులని వారి మనం ఎలా చెబితే అలా ప్రవరిస్తారన్నారు. వారిని సరైన దారిలో నడపాలని తల్లిదండ్రులకు సూచించారు. ఎమినెంట్ ప్రొఫెసర్ డా.బాలమురళీకృష్ణ మాట్లాడుతూ తల్లే మనకు అన్నీ అన్నారు. తల్లి మన మొదటి గురువు , గురువు ఆ తరువాత వస్తారన్నారు. జీవితమే ఒక అనుభవం అన్నారు. ఎమినెంట్ సైంటిస్ట్ డాక్టర్ కలశపూడి శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థులు సక్రమమైనా ఆహారపు అలవాట్లు అలవర్చుకోవాలన్నారు. సరైన ఆహారమే మంచి ఆరోగ్యాన్ని, తెలితేటలు ఇస్తుందన్నారు. ఎమినెంట్ సైకాలజిస్టు డా.షాలినీ కొచ్చర్ల మాట్లాడుతూ పిల్లల్లో ఐదు సంవత్సరాలలోప మానసిక వికాసానికి అత్యంత కీలకమన్నారు. ఏకాగ్రత స్థాయి, సృజన ఆ దశలో బాగా అభివృద్ధి చెందుతందన్నారు. ఎమినెంట్ స్టోరీటెల్లర్ ఎం.ఎస్.నివేదిత కోల్కర్ తన కథ ద్వారా ఒత్తిడి, అవహేళన, భయం కారణంగా పిల్లలు తమ ఆత్మ విశ్వాసాన్ని కోల్పోతారన్నారు. వారంతట వారు ఉత్సకతతో నేర్చుకునేలా చక్కని పరిస్థితులను, అవసరాన్ని కల్పిస్తే దేనినైనా సాధించగలరని వివరించారు.కార్యక్రమానికి అధ్యక్షత వహించిన శ్రీప్రకాష్ విద్యానికేతన్ డైరెక్టర్ వాసుప్రకాష్ మాట్లాడుతూ పిల్లలు కేవలం చదువులోనే కాదు ఆటపాటల్లో కూడా ముందుండాలన్నారు. వేడుకల్లో భాగంగా విద్యార్థుల ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు, ఎగ్జిబిషన్ ఆకట్టుకున్నాయి.

బీచ్‌రోడ్డులో మారథాన్ రేపు

విశాఖపట్నం (స్పోర్ట్సు), నవంబరు 8, (ఆంధ్రజ్యోతి): నమహ అకాడమీ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం బీచ్‌రోడ్డులో మారథాన్ రన్ నిర్వహించనున్నట్టు సంస్థ ప్రతిని.ధి సురేశ్‌బాబు తెలిపారు. ఆత్మరక్షణ, ఫిట్‌నెస్ అంశాలపై అవగాహన కల్పనకు నిర్వహిస్తున్న ఈ మారథాన్ రన్ బీచ్ రోడ్డులోని విశ్వప్రియ ఫంక్షన్ హాల్ వద్ద ఉదయం 5.30 గంటలకు ప్రారంభం అవుతుందన్నారు. మూ డు, ఐదు కి.మీ మేర జరిగే ఈ రన్‌లో సు మారు 700 మంది పాల్గొంటారన్నారు.

ఘనంగా పుష్పయాగ సంకల్పం


పుష్పయాగానికి తీసుకువచ్చిన కలువలు, తామరలు

ఎంవీపీ కాలనీ, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ఎంవీపీ కాలనీలోని టీటీడీ కల్యాణ మండపంలో శుక్రవారం శ్రీవారికి పుష్పయాగ సంకల్పం నిర్వహించారు. పి.రంగనాధాచార్యులు ప్రత్యేక అతిథిగా పాల్గొన్న ఈ కార్యక్రమం శ్రీవారి సేవా టీమ్, కర్తీక దీపోత్సవం ఆధ్వర్యంలో నిర్వహించారు. గ్రంధి రాజేష్, హిమాంశుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఫేస్ రికగ్నైజేషన్ మినహాయించాలి

మద్దిలపాలెం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : వైద్య, ఆరోగ్యశాఖలో ఫీల్డ్ ఉద్యోగులకు ముఖ ఆధారిత హాజరు నుంచి మినహాయింపు ఇవ్వాలని టీఎన్‌టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.శేషుబాబు ఒక ప్రకటనలో కోరారు. ఫేస్ హాజరను జీతాలతో అనుసంధానం చేయడంపై రాష్ట్ర ప్రభుత్వం పునరాలోచన చేయాలని పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో రోగులను గుర్తించడానికి వైద్య సిబ్బంది సమయపాలన లేకుండా పని చేస్తున్నారన్నారు. ప్రస్తుతం మలేరియా, డెంగ్యూ, డయేరియా వ్యాప్తిని అరికట్టడానికి ఇంటింటికి వెళ్లి విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. ఫేస్ హాజరు యాప్ లోకేషన్ ప్రకారం హాజరు తీసుకుంటుందని, ఈ విధానం ఫీల్డ్ ఉద్యోగులకు ఇబ్బందిగా ఉంటుందని పేర్కొన్నారు. జీతాల్లో కోత పడుతోందన్నారు.

బాల్య దశ నుంచే సేవాగుణం అలవడాలి


కార్యక్రమంలో పాల్గొన్న విద్యారులు, ఉపాధ్యాయులు

ఆరిలోవ, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు బాల్య దశ నుంచే సేవాగుణం అలవాటు చేసేది స్కౌట్ అని జిల్లా స్కౌట్ శిక్షణ కమిషనర్ స్వామి నాయుడు అన్నారు. శుక్రవారం భారత్ స్కౌట్స్ అండ్ గౌడ్స్ జాతీయ వారోత్సవాల సందర్భంగా తోటగరువు జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన వారోత్సవాల్లో ఆయన విద్యారులకు పలు సూచనలు చేశారు. తొలుత జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు విద్యతో పాటు క్రమశిక్షణ ఎంతో ముఖ్యమన్నారు. విద్యార్థులతో ఎప్పుడూ ఎదుటి వారి మెచ్చుకునే పనులను మాత్రమే చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం దుర్గాభవానీ, ఉపాధ్యాయులు చిన్నమ్మలు, టి.రామకృష్ణ, విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

ఏయూ అంతర్ కళాశాలల టెన్నిస్ టోర్నీ ప్రారంభం

విశాఖపట్నం (స్పోర్ట్సు), నవంబరు 8, (ఆంధ్రజ్యోతి): ఏయూ స్పోర్ట్సు బోర్డు ఆధ్వ ర్యంలో అంతర్ కళాశాలల పురుషుల మహిళల టెన్నిస్ చాంపియన్‌షిప్ కమ్ ఏయూ జట్టు ఎంపిక పోటీలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఏయూ టెన్నిస్ కాంప్లెక్స్‌లో ఈ పోటీలను ఏయూ ఉపకులపతి ఆచార్య జి.శశిభూషణరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో క్రీడల అభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రవేశపెట్టిన నూతన పాలసీ ఎంతో దోహదపడుతుందన్నారు. ఏయూ స్పోర్ట్సు బోర్డు కార్యదర్శి, ఫిజికల్ ఎడ్యుకేషన్ స్పోర్ట్సు సైన్సెస్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎన్.విజయ్‌మోహన్ మాట్లాడుతూ ఈ పోటీల్లో రా ణించిన క్రీడాకారులు త్వరలో త్రివేండ్రంలో జరిగే సౌత్‌జోన్ అంతర్ వర్సిటీ టెన్నిస్ టోర్నీలో పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏయూ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ ఫ్యాకల్టీ దొరబాబు, ఫిజికల్ డైరెక్టర్ లక్ష్మయ్య, టెన్నిస్ కోచ్ బాబ్జీ, సుదర్శన్ పాల్గొన్నారు.

విశాఖ బాగా నచ్చింది

- ప్రముఖ గాయకుడు ఆర్మాన్ మాలిక్
- నేడు నగరంలో మ్యూజికల్ నైట్


విలేకరులతో మాట్లాడుతున్న గాయకుడు ఆర్మాన్ మాలిక్

ఎంవీపీ కాలనీ/ సిరిపురం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : తన సొంత ఊరు విశాఖ అని, మాతృ భాష తెలుగేనని ప్రముఖ సినీ గాయకుడు ఆర్మాన్ మాలిక్ అన్నారు. శుక్రవారం ఎంవీపీ కాలనీలోని గాదిరాజు ప్యాలెస్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నగరంలోని రాడిసన్ బ్లూలో శనివారం నిర్వహించనున్న మ్యూజికల్ నైట్ కోసం తాను విశాఖ వచ్చినట్లు తెలిపారు. తాను పలు భాషల్లో 350, తెలుగులో 30 పాటలు పాడినట్టు తెలిపారు. అలవైకుంఠపురంలోని 'బుట్టబొమ్మ..'పాట ఇష్టమని, తెలుగులో పేరు తెచ్చింది కూడా ఆ పాటేనన్నారు. తన తల్లిది విశాఖ అని, నగరానికి మొదటిసారి వచ్చిన సందర్భంలో ఇక్కడ తెలుగు మాట్లాడాలని ఆమె గట్టిగా చెప్పినట్లు పేర్కొన్నారు. విశాఖ అందాలకు తాను ముగ్ధుడునయ్యానని తెలిపారు. ఇక్కడే ఓ ఇంటిని కొనుక్కుందామని అమ్మకు చెప్పినట్లు పేర్కొన్నారు. ఫోర్త్ గ్రూప్ ఈవెంట్స్ హూస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

ఏయూలో 70 ప్రాంతాల్లో ఆర్వో ప్లాంట్లు

- రూ.1.98 కోట్లతో నిర్మాణానికి దివీస్ లేబరేటరీ సుముఖం


వీసీకి చెక్‌ను అందజేస్తున్న దివీస్ లేబరేటరీ ప్రతినిధులు

వెంకోజీపాలెం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ఏయూకు దివీస్ లేబరేటరీస్ లిమిటెడ్ భారీ సహాయాన్ని అందించడానికి ముందుకు వచ్చింది. వర్సిటీలో 70 ప్రాంతాల్లో విద్యార్థులు, ఉద్యోగులకు ఉపయుక్తంగా నిలిచే ఆర్వో వాటర్ ప్లాంట్లను ఏర్పాటు చేయనుంది. ఇందుకు సంబంధించి దివీస్ లాబరేటరీ సీఎస్సార్ నిధుల నుంచి రూ.1.98 కోట్లు మంజూరు చేసింది. ఇటీవల ఏయూలో అనలిటికల్ కెమిస్ట్రీ విభాగ లాబరేటరీని సైతం రూ.30 లక్షలతో దివీస్ లేబరేటరీ యాజమాన్యం ఆధునీకరించి అందజేసింది. తాజాగా మరో భారీ విరాళాన్ని అందిస్తూ దీనికి సంబంధించిన ఉత్తర్వులు కాపీని ఏయూ వీసీ జి.శశిభూషణరావుకు శుక్రవారం దివీస్ లేబరేటరీ సీఎస్ఆర్ విభాగం సీనియర్ మేనేజర్ డి.సురేష్‌కుమార్ అందజేశారు. ఏయూలో అధికారులు సూచించిన ప్రాంతాలలో 70 ఆర్వో వాటర్ ప్లాంట్లను నిర్మించి దివీస్ లేబరేటరీ అందిస్తుంది. ఈ సందర్భంగా ఏయూ వీసీ జి.శశిభూషణరావు మాట్లాడుతూ దివీస్ లాబరేటరీ ఛైర్మన్ మురళి దివీస్ మానవతా దృక్పథంతో ప్రభుత్వ వర్సిటీ విద్యార్థులకు ఉపయుక్తంగా భారీ విరాళాన్ని సీఎస్ఆర్ నిధుల రూపంలో అందించడంపై కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఏయూ రిజిస్ట్రార్ ఈఎస్ ధనుంజయరావు తదితరులు పాల్గొన్నారు.

కొండవాలు ప్రాంతంలో కార్పొరేటర్ పర్యటన


యూజీడీ లైన్‌ను పరిశీలించిన కార్పొరేటర్ శ్రీవిద్య, అధికారులు

వెంకోజీపాలెం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 15వ వార్డులోని సింహాద్రిపురం కొండవాలు ప్రాంతంలోని యూజీడీ లైన్‌ను జీవీఎంసీ వాటర్ సప్లై అండ్ యూజీడీ మెయింటెనెన్స్ ఎస్‌ఈ కేవీఎస్ రవి, ఏఈ షేక్ రహీమ్, వర్క్ ఇన్‌స్పెక్టర్ సాయి, స్థానిక కార్పొరేటర్ అప్పారి శ్రీవిద్యతో కలిసి పైపులైన్‌ను, మేన్‌హోల్ లీకేజ్‌లను పరిశీలించారు. ఇప్పటి వరకు వార్డులో రూ.1.5 కోట్లతో యూజీడీ వర్క్‌లను చేసినట్టు కార్పొరేటర్ తెలిపారు. ఈ కొండవాలు ప్రాంతంలో మాత్రం యూజీడీ సమస్య పరిష్కారం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కొండ ప్రాంతం నుంచి వెళ్లి పాత వెంకోజీపాలెం జంక్షన్‌లో మంచినీటి ప్రధాన పైపు లైను ఉండటంతో యూజీడీ పైపులైన్‌ను ఎల్ షేప్ తిప్పడం జరిగిందని, ఆ ప్రాంతంలో మరో ప్రత్యామ్నాయ మార్గాన్ని ఏర్పాటు చేసి యూజీడీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని అధికారులను కార్పొరేటర్ కోరారు. అధికారులు స్పందిస్తూ త్వరలోనే దీనిపై పునరాలోచించి శాశ్వత పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కార్పొరేటర్ భర్త, జీవీఎంసీ లీగల్ కౌన్సిల్ సభ్యులు అప్పారి వెంకటగిరిబాబు, స్థానిక టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

12వ వార్డులో టీడీపీ సభ్యత్వాల నమోదు


సభ్యత్వాలను నమోదు చేస్తున్న సన్యాసిరావు, అప్పలరాజు తదితర టీడీపీ నేతలు

ఆరిలోవ, నవంబరు 8 : జీవీఎంసీ 12వ వార్డులో గల లీలాసుందరయ్యనగర్‌లో విశాఖ పార్లమెంట్ కమిటీ టీడీపీ కార్యదర్శి ఏడువాక సన్యాసిరావు ఆధ్వర్యంలో 24వ బూత్ పరిధిలో తెలుగుదేశం పార్టీ సభ్యత్వాలను నమోదు చేశారు. ఈ సభ్యత్వం తీసుకోవడం వల్ల మంచి రాజకీయ నిర్ణయాన్ని తీసుకున్నట్టు అవుతుందని సన్యాసిరావు పేర్కొన్నారు. అలాగే బీమా సదుపాయం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ వార్డు ఇన్‌చార్జ్ ఒమ్మి అప్పలరాజు, వార్డు అధ్యక్షుడు గాడి సత్యం, బసవ దేవల్లు, రాపర్తి గణపతి, వాసు, అప్పాజీ తదితరులు పాల్గొన్నారు.

డీఎస్సీ అభ్యర్థులకు ఉచిత కోచింగ్

డాబాగార్డెన్స్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) :అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రం, యూటీఎఫ్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల పదో తేదీ నుంచి కంచరపాలెం హైవేలో నున్న బొట్ట నరసింగరావు భవన్‌లో ఉచిత డీఎస్సీకి సిద్ధమవుతున్న అభ్యర్థులకు ఉచిత కోచింగ్ అందించనున్నట్టు కో ఆర్డినేటర్ సతీశ్ తెలిపారు. బడుగు, బలహీనవర్గాలు, ఆర్థికంగా వెనుకబడిన యువత ఈ కోచింగ్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఇతర వివరాలకు ఫోన్ 93472 05549ను సంప్రదించాలని కోరారు. డీఎస్సీకి దరఖాస్తు చేసిన నిరుద్యోగ ఉపాధ్యాయ అభ్యర్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు.

డీఎస్సీ అభ్యర్థులకు ఉచిత కోచింగ్

డాబాగార్డెన్స్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) :అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రం, యూటీఎఫ్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల పదో తేదీ నుంచి కంచరపాలెం హైవేలో ఉన్న బొట్ట నరసింగరావుభవన్‌లో ఉచిత డీఎస్సీకి సిద్ధమవుతున్న అభ్యర్థులకు ఉచిత కోచింగ్ అందించనున్నట్టు కో ఆర్డినేటర్ సతీశ్ తెలిపారు. బడుగు, బలహీనవర్గాలు, ఆర్థికంగా వెనుకబడిన యువత ఈ కోచింగ్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఇతర వివరాలకు ఫోన్ 93472 05549 ను సంప్రదించాలని కోరారు.

బీచ్‌రోడ్డులో మారథాన్ రేపు

విశాఖపట్నం (స్పోర్ట్సు), నవంబరు 8, (ఆంధ్రజ్యోతి): నమహ అకాడమీ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం బీచ్‌రోడ్డులో మారథాన్ రన్ నిర్వహించనున్నట్టు సంస్థ ప్రతినిధి సురేశ్‌బాబు తెలిపారు. ఆత్మరక్షణ, ఫిట్‌నెస్ అంశాలపై అవగాహన కల్పనకు నిర్వహిస్తున్న ఈ మారథాన్ రన్ బీచ్‌రోడ్డులోని విశ్వప్రియ ఫంక్షన్ హాల్ వద్ద ఉదయం 5.30 గంటలకు ప్రారంభం అవుతుందన్నారు. మూడు, ఐదు కి.మీ మేర జరిగే ఈ రన్‌లో సుమారు 700 మంది పాల్గొంటారన్నారు. వయసుతో నిమిత్తం లేకుండా పురుషులు, మహిళలు పాల్గొనవచ్చునని తెలిపారు.

ఏయూ అంతర్ కళాశాలల టెన్నిస్ టోర్నీ ప్రారంభం

విశాఖపట్నం (స్పోర్ట్సు), నవంబరు 8, (ఆంధ్రజ్యోతి): ఏయూ స్పోర్ట్సు బోర్డు ఆధ్వర్యంలో అంతర్ కళాశాలల పురుషుల మహిళల టెన్నిస్ చాంపియన్‌షిప్ కమ్ ఏయూ జట్టు ఎంపిక పోటీలు శుక్రవారం ప్రారంభమాయ్యాయి. ఏయూ టెన్నిస్ కాంప్లెక్స్‌లో ఈ పోటీలను ఏయూ ఉపకులపతి ఆచార్య జి.శశిభూషణరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో క్రీడల అభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రవేశపెట్టిన నూతన పాలసీ ఎంతో దోహదపడుతుందన్నారు. ఏయూ స్పోర్ట్సు బోర్డు కార్యదర్శి, ఫిజికల్ ఎడ్యుకేషన్ స్పోర్ట్సు సైన్సెస్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎస్.విజయ్‌మోహన్ మాట్లాడుతూ ఈ పోటీల్లో రాణించిన క్రీడాకారులు త్వరలో త్రివేండ్రంలో జరిగే సౌత్‌జోన్ అంతర్ వర్సిటీ టెన్నిస్ టోర్నీలో పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏయూ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ ఫ్యాకల్టీ దొరబాబు, ఫిజికల్ డైరెక్టర్ లక్ష్మయ్య, టెన్నిస్ కోచ్ బాబ్జీ, సుదర్శన్ పాల్గొన్నారు.

నేడు భక్తిపాటల పోటీలు

డాబాగార్డెన్స్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) :బాలల దినోత్సవం పురస్కరించుకుని క్రైస్తవ భక్తిపాటల పోటీలను ఈనెల 9న నిర్వహించనున్నట్టు హోలీవే మినిస్ట్రీస్ సమన్వయకర్త డాక్టర్ ఇ.సత్యానందకుమార్ తెలిపారు. 5 నుంచి 15 సంవత్సరాలలోపు వయసుగల పిల్లలు ఈ పోటీల్లో పాల్గొనేందుకు అర్హులు అన్నారు.పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేస్తామన్నారు. ఎంవీపీ కాలనీ, పోలీస్ స్టేషన్ ఎదురుగా హోలీటవర్స్ భవనంలో పోటీలు నిర్వహిస్తామన్నారు. వివరాలకు 98666 81122లో సంప్రతించాలని కోరారు.

కలెక్టరేట్ ఉద్యోగులకు వైద్య పరీక్షలు


మహారాణిపేట, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్‌లో ఉద్యోగులు, రెవెన్యూ సిబ్బందికి వైద్య శిబిరం నిర్వహించారు. కలెక్టరేట్ రెవెన్యూ అసోసియేషన్ భవనంలో ఇండస్ ఆసుపత్రి సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఈ శిబిరాన్ని కలెక్టర్ హరేంధిర ప్రసాద్ ప్రారంభించారు. సుమారు వంద మంది ఉద్యోగులు వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌వో భవానీశంకర్, ఏవో ఈశ్వరరావు, ఎస్‌ఏ త్రినాథరావు తదితరులు పాల్గొన్నారు.

యూజీడీ పనులకు శంకుస్థాపన


శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్ నాగరాజు

జ్ఞానాపురం, నవంబరు 8,(ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 32వార్డు నేరెళ్ల కోనేరు నుంచి చావుల మదుం వరకు సుమారు రూ. 20 లక్షల వ్యయంతో నిర్మించనున్న భూగర్భ డ్రైనేజీ పనులకు శుక్రవారం కార్పొరేటర్ కందుల నాగరాజు శంకుస్థాపన చేశారు. దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ సహకారంతో మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో నారా నాగేశ్వరరావు, మంత్రిశాలి వాహన, కొట్టాల రమేశ్, కందుల బద్రీ, కేదార్ నాథ్‌లు పాల్గొన్నారు.

నిరాశ్రయులకు సేవతో ఆనందం


దుప్పట్లు పంపిణీ చేస్తున్న సువర్ణరాజ్

డాబాగార్డెన్స్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): అభాగ్యులకు సేవ చేయడంలో ఆనందం ఉంటుందని రేఫుజ్ మినిస్ట్రీస్ వ్యవస్థాపకుడు జాకబ్ సువర్ణరాజ్ అన్నారు.శుక్రవారం ఎల్ఐసీ కూడలి, ఆర్టీసీ కాంపెక్స్, సంఘం శరత్, రైల్వేస్టేషన్ ప్రాంతాల్లో అభాగ్యులకు చలికాలం కావడంతో వారందరికీ దుప్పట్లు భోజన ప్యాకెట్లను పంపిణీ చేశారు. నిరాశ్రయులకు తమవంతుగా వివిధ సేవా కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ స్నేహప్రియ, సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

కేజీహెచ్‌లో అంబులెన్స్‌ల మాఫియా

» మృతదేహాల తరలింపులో వసూళ్ల పర్వం


కేజీహెచ్ వద్ద ప్రైవేటు అంబులెన్స్‌లు

మహారాణిపేట, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): కేజీహెచ్‌ను అంబులెన్స్ మాఫియా చుట్టుముడుతోంది. ఆపదలో, కష్టాల్లో ఉన్నారన్న కనీస మానవత్వం లేకుండా రోగులు, మృతుల సంబంధీకులను దోచుకు తింటున్నారు. ఆసుపత్రి లోపల, బయట అంబులెన్స్‌లే కనిపిస్తాయి. కేజీహెచ్‌లో ఎవరైనా అనారోగ్యంతో కన్నుమూస్తే వారిని ఇంటికి తరలించేందుకు ప్రభుత్వం మహాప్రస్థానం వాహనాలను ఏర్పాటు చేసింది. కేజీహెచ్‌లో ఇలాంటి ఆరు వాహనాలు అందుబాటులో ఉన్నాయి. అందులో ఒకటి సాంకేతిక సమస్యతో ఆగిపోయినా, మిగిలిన ఐదు వాహనాలు నిత్యం తిరుగుతుంటాయి. కానీ ఈ మహాప్రస్థానం పనితీరుపై అనేక ఫిర్యాదులు వస్తున్నాయి. కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ తీవ్ర అనారోగ్య కారణాలతో నిత్యం సగటున 20 మంది మరణిస్తారు. ఇందులో సగటున 8 మృతదేహాలను మాత్రమే మహాప్రస్థానం వాహనాల్లో వారి స్వస్థలాలకు తరలిస్తుంటారు. అంటే ఒక వాహనం ఒకటి లేదా రెండు మృతదేహాలను మాత్రమే తరలిస్తుంది. మిగిలిన మృతదేహాల తరలింపునకు ప్రైవేటు అంబులెన్సులే గతి. ఇదే అదనుగా బాధిత బంధువుల నుంచి అధికంగా డబ్బులు దోచుకుంటున్నారు. ఈ విషయంలో ప్రైవేటు అంబులెన్స్‌ల వారు, మహాప్రస్థానం వాహన సిబ్బంది కుమ్మక్కై ప్రజల నుంచి వేలాది రూపాయలు దోచుకుంటున్నారని అనేక మంది ఫిర్యాదు చేస్తున్నారు. మహాప్రస్థానం వాహనాల్లో ఉచితంగా తరలించవలసిన మృతదేహాలకు డబ్బులు డిమాండ్ చేస్తున్నారు. మృతుల బంధువులు డబ్బు ఇవ్వలేకుంటే వాహనం అందుబాటులో లేదని చెప్పి ప్రైవేటు అంబులెన్స్ వారికి అప్పగిస్తున్నారని వాపోతున్నారు. ముఖ్యంగా దూరప్రాంతాలకు మృతదేహాలను తరలించేందుకే ప్రాధాన్యత ఇస్తూ వారి వద్ద అధిక మొత్తంలో డబ్బులు డిమాండ్ చేస్తారు. వారు ఇవ్వడానికి నిరాకరించినా, ఇవ్వలేని పరిస్థితిలో ఉన్నా ప్రైవేటు అంబులెన్స్‌లకు బేరం అప్పగించి వారి వద్ద కమీషన్ తీసుకుంటున్నారు. ఆసుపత్రి వద్ద వీరంతా ఓ పెద్ద మాఫియాగా మారిపోయారు. కేజీహెచ్‌కు వచ్చేది పేదలు మాత్రమే. వారు వేలాది రూపాయలు వెచ్చించి ప్రైవేటు అంబులెన్స్‌లలో తరలించే పరిస్థితి ఉండదు. బహిరంగ రహస్యంగా సాగిపోతున్న ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులు దృష్టి నిలిపి ఈ మాఫియా దోపిడీని అరికట్టాలని పలువురు కోరుతున్నారు.

పరిశుభ్రతకు ప్రాధాన్యమివ్వండి: కలెక్టర్


అక్షయపాత్ర కిచెన్‌లో బియ్యం ప్యాకెట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్


కప్పరాడ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్, డీఈవో

» కంచరపాలెంలోని అక్షయపాత్ర కిచెన్ పరిశీలన

» కప్పరాడ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులతో మాటా మంతీ

కంచరపాలెం, నవంబరు 8: ప్రజారోగ్యంపై శ్రద్ధ వహించాలని, పరిశుభ్రతకు ప్రాధాన్యమివ్వాలని కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. కంచరపాలెం ఐటీఐ జంక్షన్ సమీపంలోని అక్షయపాత్ర ఫౌండేషన్ సెంట్రలైజ్డ్ కిచెన్‌ను ఆయన శుక్రవారం ఆకస్మికంగా సందర్శించారు. వంటశాలలను సందర్శించి అక్కడ వంట సరకులు, బియ్యం నాణ్యతను పరిశీలించారు. తాజా కూరగాయలను మాత్రమే వంటకు వినియోగించాలని సిబ్బందికి ఆదేశించారు. పాడైన క్యారెట్ దుంపలను చూసి తక్షణమే వాటిని మార్చాలని ఆదేశించారు. స్థానిక అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించి చిన్నారులతో మమేకమయ్యారు. ఈ కార్యక్రమంలో భాగంగా కప్పరాడ ఉన్నత,ప్రాథమిక పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రం, యూహెచ్‌సీలను సందర్శించారు. కప్పరాడ పాఠశాలలో మధ్యాహ్నం భోజనం నాణ్యతను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఐటీఐ ప్రాంతంలో నిర్వహించే ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో పాల్గొని స్థానికులుతో మాట్లాడారు.

కప్పరాడ పాఠశాలలో డీఈవో తనిఖీ

కప్పరాడ ఉన్నత,ప్రాథమిక పాఠశాలలను డీఈవో ఎన్.ప్రేమ్‌కుమార్ శుక్రవారం కలెక్టర్ పర్యటనలో భాగంగా తనిఖీలు నిర్వహించారు. పాఠశాల్లో మధ్యాహ్నం భోజనాన్ని రుచి చూసి పిల్లలకు భోజనం వడ్డించారు. తరగతుల్లో బోధన తీరును పరిశీలించారు. ఉపాధ్యాయులు లెస్సన్ ప్లాన్స్ లేకుండా బోధించడంపై అసహనం వ్యక్తం చేశారు.అనంతరం రికార్డులను పరిశీలించారు. చిన్నారులు ప్రభుత్వం పంపిణీ చేస్తున్న పౌష్టికాహారం వారు తీసుకునేలా పర్యవేక్షించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో దివాకర్, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విశాఖ బాలోత్సవంలో అవార్డులు ప్రదానం



అవార్డులు అందుకున్న వారితో బాలోత్సవం నిర్వాహకులు, ముఖ్య అతిథులు

సీతంపేట, నవంబరు 8: (ఆంధ్రజ్యోతి): ద్వారకానగర్‌లో గల పౌరగ్రంథాలయంలో శిఖరం ఆర్ట్ థీయర్స్ ఆధ్వర్యంలో విశాఖ బాలోత్సవం నృత్య కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. నర్తనశాల డ్యాన్స్ అకాడమీ, మీనా దార్లపూడి మీనాక్షి కూచిపూడి డాన్స్ అసోసియేషన్, వైజాగ్ నాగ జ్యోతి కావూరి, రాగా మ్యూజిక్ అకాడమీ, వైజాగ్ టి.సాయిమాధవి శివసాయి నృత్య కళాక్షేత్రాల ఆధ్వర్యంలో గురువులు డాక్టర్ రాధికారాణి చేతుల మీదుగా 25 మంది నృత్యా కళాకారులకు నాట్యబిరామ, అయోధ్య రామ, బాల పురస్కారాలు- 2024ను అందచేశారు. ముఖ్య అతిథులుగా హాజరై బళ్లమూడి ప్రత్యూష, మీగడ శశిభూషణ్, ఎంవీ సుబ్రహ్మణ్యం, తిలక్ పట్నాయక్ చేతుల మీదుగా ఈ అవార్డులను అందించారు. ఈ కార్యక్రమంలో అల్లు వెంకట రమణ, అభిమానులు పాల్గొన్నారు.

నివాస గృహాలకు జియోట్యాగింగ్ పూర్తిచేయాలి


సమావేశంలో సూచనలిస్తున్న జీవీఎంసీ అడిషనల్ కమిషనర్ సోమన్నారాయణ

జ్ఞానాపురం, నవంబరు8 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీలోని జోన్-5 సచివాలయల పరిధిలోని లబిదారులకు మంజైన ఇళ్ల స్థలాలకు జియోట్యాగింగ్ ప్రక్రియ పూర్తి చేయాలని జీవీఎంసీ అడిషనల్ కమిషనర్ సోమన్నారాయణ హౌసింగ్ ఏఈలు, సచివాలయ ఎనిమెటీస్ సెక్రటరీలు, వార్డు వెల్ఫేర్ కార్యదర్శులను ఆదేశించారు. శుక్రవారం జ్ఞానాపురంలోని జోనల్ కార్యాలయంలో అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ పెండింగ్ లేకుండా అందరికీ జియోట్యాగింగ్ పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో జోనల్ కమిషనర్ బి.రాము, ఏపీడీలు పుణ్యవతి, కృపానందం, హౌసింగ్ ఏఈ రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

నూతన పాలసీతో క్రీడాకారులకు మేలు

» ఒలింపిక్ సంఘం విశాఖ కార్యదర్శి కంచరాన సూర్యనారాయణ



విశాఖపట్నం (స్పోర్ట్సు), నవంబరు 8, ఆంధ్రజ్యోతి: రాష్ట్రంలో క్రీడా రంగ అభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రవేశపెట్టిన క్రీడా పాలసీ అద్భుతంగా ఉందని ద ఒలింపిక్ సంఘం విశాఖ శాఖ ప్రధాన కార్యదర్శి కంచరాన సూర్యనారాయణ హర్షం ప్రకటించారు. రాష్ట్రం నుంచి ఆసియా గేమ్స్, ఒలింపిక్స్, వరల్డ్ కప్ తదితర అంతర్జాతీయ క్రీడలతోపాటు జాతీయ స్థాయి క్రీడల్లో పతకాలు సాధించే క్రీడాకారుల ను ప్రోత్సహించేందుకు ఈ నూతన పాలసీ తోడ్పడుతుందన్నరు. అలాగే, రాష్ట్రానికి క్రీడా కేంద్రంగా రూ పొందుతున్న విశాఖలో ఒలింపిక్ భవనం నిర్మాణం చేపట్టాలని కోరారు. వివిధ క్రీడాంశాలలో క్రీడాకారులను తీర్చిదిద్దేందుకు అర్హత, నైపుణ్యం కలిగిన కోచ్‌లను నియమించాలని కోరారు. అలాగే, అకాడమీలు ఏర్పాటు చేయడంతోపాటు తగిన సంఖ్యలో క్రీడా పరికరాలు పంపిణీ చేయాలని కోరారు.

'గీత కార్మికులకు ఇబ్బందిలేకుండా చర్యలు తీసుకోవాలి'


సమావేశంలో మాట్లాడుతున్న ఉత్తరాంధ్ర యాత సంక్షేమ సంఘం అధ్యక్షుడు నూకరాజు

అక్కయ్యపాలెం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మద్యం షాపుల కేటాయింపులో కల్లు గీత కార్మికులకు ఇబ్బందులు లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఉత్తరాంధ్ర యాత సంక్షేమ, సాంస్కృతిక సేవా సంఘం అధ్యక్షుడు పిల్లి నూకరాజు కోరారు. నరసింహనగర్‌లోని కార్యాలయంలో శుక్రవారం సంఘ ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గీత వృత్తి కులాలవారికి పదిశాతం రిజర్వేషన్ ప్రాతిపదికన రిటైల్ షాపులు కేటాయిస్తామన్న ప్రభుత్వ ప్రకటనపై హర్షం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో బసరమాని ఈశ్వరరావు, సంపంగి మంగరాజు, సమ్మా గోవింద, నోట్ల శ్రీనివాసరావు, వనుము దేముడు, పాలికల చలం, వరహాలు, రాజా రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వ నమోదుకు విశేష స్పందన


తెలుగుదేశం పార్టీ సభ్యత్వాన్ని స్వీకరించిన మహిళను సత్కరిస్తున్న చిన్న భరత్


సభ్యత్వ నమోదులో పాల్గొన్న టీడీపీ దక్షిణ ఇన్‌చార్జి సీతంరాజు సుధాకర్, నాయకులు

అక్కయ్యపాలెం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వాన్ని తీసుకున్న ప్రతి ఒక్కరికి పార్టీ అండగా ఉంటుందని 47వ వార్డు టీడీపీ నాయకురాలు యాగాటి ఆదిలక్ష్మి అన్నారు. రాంజీఎస్టేట్‌లో శుక్రవారం సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఆ పార్టీ నాయకుడు చిన్న భరత్ హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా లక్ష్మి మాట్లాడుతూ, పార్టీ బలోపేతానికి కష్టపడిన కార్యకర్తలు, నాయకులను అధిష్ఠానం గుర్తిస్తుందన్నారు. అనంతరం ఆదిలక్ష్మిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో వార్డు ఇన్‌చార్జి మోర్తా రాజారావు, నాయకులు రమణ మాస్టారు, ధనాల అప్పారావు, బాబి, రాజమండ్రి వెంకటరావు, శ్రీను, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

అల్లిపురం: గ్రేటర్ 34 వార్డులోని అచ్చియ్యమ్మపేటలో తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం జోరుగా కొనసాగుతోంది. శుక్రవారం నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి సీతంరాజు సుధాకర్ ఈ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. పార్టీ సభ్యత్వ నమోదు చేసుకున్న వారికి రూ. 5 లక్షల వరకు బీమా సదుపాయం వర్తిస్తుందని, ఇది కుటుంబానికి భరోసాగా నిలుస్తుందని ఈ సందర్భంగా ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు వాసుపల్లి రామ్‌కుమార్, పి.రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

పునాదికే రూ.10 కోట్లా!?

... 5వ పేజీ తరువాయి

పట్టించుకోలేదు. కాగా పునాదుల కోసం తవ్విన గొయ్యిని సగం వరకు కాంక్రీట్‌తో కప్పేసి అక్కడ నుంచి భవన నిర్మాణానికి పిల్లర్లు వేశారు. భూగర్భ జల శాఖ మంజూరుచేసిన రూ.10 కోట్లు అక్కడ వరకే సరిపోయాయంటూ చేతులెత్తేశారు. ప్రభుత్వ పెద్దల దన్నుతో అప్పటి అధికారులు ఇష్టానుసారంగా నిధులు ఖర్చు చేశారని సిబ్బంది వ్యాఖ్యానిస్తున్నారు. ఈ వ్యవహారంలో కొందరు అధికారులు భారీగా సొమ్ములు తిన్నారనే ఆరోపణలు ఉన్నాయి.

ఉత్తరాంధ్ర సుజల స్రవంతి నుంచి రూ. 5.5 కోట్లు కేటాయింపు

భూగర్భ జల శాఖ ఇచ్చిన రూ.10 కోట్లు ఖర్చు అయిపోవడంతో రెగ్యులర్ జల వనరుల శాఖ అధికారులు భవన నిర్మాణం నుంచి తప్పుకున్నారు. భవనం ఎంత వరకు వచ్చిందని భూగర్భ జల శాఖ అధికారులు ప్రశ్నించడంతో జల వనరుల శాఖ ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని ముందుగా ప్రతిపాదించిన మూడు అంతస్తుల భవనం నిర్మించి ఇస్తామని చెప్పి, ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టు నుంచి రూ. 5.5 కోట్లు మంజూరుచేశారు. దీంతో మరోసారి టెండర్లు పిలిచి సెల్లార్, స్టిల్ట్, ఫస్ట్ ఫ్లోర్ నిర్మాణాలు చేపట్టారు. మూడు స్లాబ్‌లు వేశారు. ఈలోగా కేటాయించిన నిధులు అయిపోయాయి. అయితే మంజూరుచేసిన రూ.5.5 కోట్లు నిధులు విడుదలకు 2024-25 ఓటాన్ అకౌంట్‌లో పొందుపరిచినా ఇంతవరకు పైసా విడుదల కాలేదు. ఈలోగా ఎన్నికలు వచ్చి కొత్త ప్రభుత్వం అధికారంలోకి రావడంతో నిధులు విడుదల కాలేదు. సుమారు ఎనిమిది నెలల నుంచి భవనం పనులు నిలిచిపోయాయి. మిగిలిన పనులు పూర్తిచేయడానికి మరో రూ.కోటి, ఫర్నీచర్, ఇతరత్రా సదుపాయాలకు మరో రూ.రెండు కోట్లు అవసరమని భావిస్తున్నారు. గత ప్రభుత్వంలో జల వనరుల శాఖ అధికారులు బాధ్యతారాహిత్యమే ఇందుకు కారణమనే విమర్శలు వినిపిస్తున్నాయి. భవన నిర్మాణ ప్రతిపాదనల్లో మార్పు, పునాదులకు రూ.10 కోట్లు ఖర్చు పెట్టడంపై విచారణ చేపట్టాలని జల వనరుల శాఖలో పలువురు డిమాండ్ చేస్తున్నారు. అదే సమయంలో భవనం పూర్తిచేసి వినియోగంలోకి తీసుకురావాలని కోరుతున్నారు.

తీరం పటిష్ఠం

... 5వ పేజీ తరువాయి

నివసించే వారికి రిస్క్ మేనేజ్‌మెంట్‌లో శిక్షణ ఇచ్చి, అండగా ఉంటారు. » ఎక్కడైనా తీరం కోతకు గురైతే వెంటనే స్పందించి తగిన నిర్మాణాలు చేపడతారు.

ఎస్‌డీఎంఏకి ప్రతిపాదనలు పంపించాం

నేషనల్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ నిధులు మంజూరుచేస్తుంది. అయితే ఈ ప్రతిపాదనలు స్టేట్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ (ఎస్‌డీఎంఏ) నుంచి వెళ్లాలి. అందుకని అమరావతిలో ఎస్‌డీఎంఏకి మొత్తం నివేదిక పంపించాం. త్వరలోనే దీనికి నిధులు వచ్చే అవకాశం ఉంది. **- భవానీ శంకర్, చీఫ్ ఇంజనీర్, వీఎంఆర్‌డీఏ**

గన్‌మెన్ లేకుండానే...

... 5వ పేజీ తరువాయి

వెంటనే తనకు గన్‌మెన్ అవసరం లేదని చెప్పి వెనక్కి పంపించేశారు. ఇది జరిగి సుమారు రెండు నెలలు అవుతోంది. కూటమిలో మిత్రపక్షాల మధ్య ఘర్షణ వాతావరణం ఉండకూడదని ఆయన బదిలీల వ్యవహారంపై మౌనం దాలిస్తే గన్‌మెన్‌ను పునరుద్ధరించకుండా పోలీసు పెద్దలు చోద్యం చూస్తున్నారని జనసేన నాయకులు ఆరోపిస్తున్నారు. సీనియర్ అయిన తమ నాయకుని పట్ల అధికారులు వ్యవహరిస్తున్న తీరు సమంజసంగా లేదంటున్నారు.

నిధులన్నీ కొందరికేనా?

... 5వ పేజీ తరువాయి

ఫిర్యాదు చేశారు. తాము ఎజెండాలో చేర్చాలని ఇచ్చిన విజ్ఞప్తులను పక్కనపెట్టి ఎవరో ఇచ్చిన వాటిని చేర్చడం ఏమిటంటూ నిలదీశారు. 96వ వార్డు కార్పొరేటర్, టీడీపీ ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాసరావు, 76వ వార్డు కార్పొరేటర్ గంధం శ్రీనివాసరావు వార్డులకే కోట్లాది రూపాయలు పనులు మంజూరుచేయడం సరికాదని మరికొందరు అసంతృప్తి వ్యక్తంచేశారు. స్టాండింగ్ కమిటీ సభ్యులకు కనీస గౌరవం లేదని గల్లా పోలిపల్లి ఆవేదన వ్యక్తంచేశారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఆ నలుగురు దోచుకున్నట్టే..ఇప్పుడు మరో నలుగురు దోచుకుంటుంటే చూస్తూ ఊరుకోవాలా?..అని ప్రశ్నించారు. ఏఏ వార్డుకు ఎంతెంత నిధులు ఇచ్చారో శ్వేతపత్రం విడుదల చేయాలని మేయర్‌ను కోరారు. స్టాండింగ్ కమిటీ సభ్యులమైనా కూడా ఎలాంటి అధికారాలు లేకుండా పోయాయని, ఇతర కార్పొరేటర్‌లకు, ప్రజలకు కూడా సమాధానం చెప్పలేకపోతున్నామని వాపోయారు.

కాగా జీవీఎంసీ పరిధిలో పలు అభివృద్ధి పనులు చేపట్టేందుకు స్థాయీ సంఘం ఆమోదం తెలిపినట్టు మేయర్ గొలగాని హరివెంకట కుమారి శుక్రవారం సాయంత్రం ఒక ప్రకటన విడుదల చేశారు. ఎజెండాలో 71 అంశాలు పొందుపరచగా, వాటిపై సభ్యులు చర్చించిన పిదప 11 అంశాలు వాయిదా వేశామని, మిగిలిన 60 అంశాలు ఆమోదం పొందాయన్నారు. ఇందులో ఇంజనీరింగ్ విభాగానికి సంబంధించిన సుమారు రూ.17.5 కోట్లు అభివృద్ధి పనులున్నాయన్నారు. సమావేశంలో జీవీఎంసీ కార్యదర్శి బి.వి.రమణ, ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ సి.వాసుదేవరెడ్డి, ఆరో జోన్ కమిషనర్ బి.ఆర్.ఎస్.శేషాద్రి, కార్యనిర్వాహక ఇంజనీర్లు తదితరులు పాల్గొన్నారు.

రైతుబజార్ల సిబ్బందికి బదిలీలు

... 5వ పేజీ తరువాయి

వెళ్లే వారికే అవకాశం కల్పించాలని రైతుబజార్ల వినియోగదారుల సంఘాలు సూచిస్తున్నారు. రోజూ కనీసం పదికి తక్కువ లేకుండా ఫిర్యాదులు వస్తాయని, సహనంతో సమాధానం చెబుతూ, గొడవలు జరగకుండా సర్దిచెప్పే సమర్థత కలిగిన వారికే అవకాశం ఇవ్వాలని కోరుతున్నారు. ఎస్టేట్ అధికారుల బదిలీలు పూర్తయిన తరువాత సహాయకుల బదిలీలు చేస్తారని అంటున్నారు. అయితే వారు దీనిని వ్యతిరేకిస్తున్నారు. పిల్లల చదువులను దృష్టిలో ఉంచుకొని ఏప్రిల్‌లో బదిలీలు చేపట్టాలని కోరుతున్నారు. రోజూ ఉదయం ఐదు గంటలకే విధులకు హాజరు కావలసి ఉంటుందని, అందుకని పనిచేస్తున్న బజార్లకు దగ్గరలో పిల్లలను పాఠశాలల్లో చేర్పించామని, ఇప్పుడు దూరప్రాంతాలకు బదిలీ చేస్తే ఇబ్బంది అవుతుందని అంటున్నారు. ఏదేమైనా రైతుబజార్లలో దుకాణాల కేటాయింపు, బదిలీల వ్యవహారంపై రకరకాల ఊహాగానాలు ప్రచారం అవుతున్న నేపథ్యంలో పారదర్శకంగా నిర్వహించాలని కోరుకుంటున్నారు. అధికారులు పెట్టిన ఫైల్‌ను జాయింట్ కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలించి నిర్ణయం తీసుకోవాలని సూచిస్తున్నారు.

మాతృ శాఖకు పర్యాటక శాఖ ఆర్‌డీ

... 5వ పేజీ తరువాయి

ఇంజనీర్ రమణ ఆధ్వర్యంలోనే సాగుతున్నాయి. రుషికొండపై రూ.500 కోట్ల విలువైన భవనం పనులు కూడా ఆయన పర్యవేక్షణలోనే జరిగాయి. ఉమ్మడి విశాఖ జిల్లాలో పర్యాటక శాఖ రిసార్ట్స్ ఆధునికీకరణ, లంబసింగి, అరకులోయ, అనంతగిరిలలో రిసార్ట్స్ పనులు కూడా ఆయనే చూస్తున్నారు. పర్యాటక సీజన్ ప్రారంభమై నెల రోజులైనా ఏవీ అందుబాటులోకి రాలేదు. ఇంకా మరమ్మతులతోనే నడుస్తున్నాయి. ఇప్పుడు అదే అధికారికి రీజనల్ డైరెక్టర్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, డివిజనల్ మేనేజర్ పోస్టులు అదనపు బాధ్యతల కింద అప్పగించారు. సిరిపురంలోని వీఎంఆర్‌డీఏ ఉద్యోగ భవన్‌లో ఉన్న ఆయన కార్యాలయం గత రెండు రోజుల నుంచి కిటకిటలాడుతోంది. సందర్శకులు కూర్చొనేందుకు కుర్చీలు కూడా దొరకడం లేదు.

కుటుంబ సభ్యుల చెంతకు మానసిక రోగి

అక్కయ్యపాలెం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): టీఎస్సార్ కాంప్లెక్స్‌లోని నిరాశ్రయుల వసతి గృహంలో ఆశ్రయం పొందుతున్న పశ్చిమ బెంగాల్‌కు చెందిన మానసిక రోగి ఆకాశ్ పన్న (33)ను కుటుంబ సభ్యులకు అప్పగించినట్టు ఏయూటీడీ కార్యదర్శి ప్రగడ వాసు తెలిపారు.

పూర్ణామార్కెట్: అదృశ్యమైన పండావీధికి చెందిన బాలిక ఆచూకీ లభ్యమైనట్టు వన్‌టౌన్ సీఐ దేముడుబాబు తెలిపారు. ఈ నెల 2న బాలిక అదృశ్యమయింది. ఆమెను గుర్తించి శుక్రవారం పోలీస్ స్టేషన్‌లో కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఆయన వెల్లడించారు.

జీతాల కోసం... ఉక్కు ఉద్యోగుల ధర్నా రేపు

ఉక్కుటౌన్‌షిప్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులు జీతాల కోసం ఆదివారం పాత గాజువాక జంక్షన్‌లో ధర్నా నిర్వహించనున్నారు. ఉక్కు ఉద్యోగులకు జీతాలు ఇవ్వాలని, ఉత్పత్తి పెంచాలని, సెయిల్ ప్లాంట్‌లో విశాఖ స్టీల్‌ప్లాంట్ విలీనం తదితర అంశాలపై ధర్నా చేపట్టనున్నట్టు సీఐటీయూ నాయకులు తెలిపారు. గత కొన్ని నెలలుగా జీతాల విషయంలో యాజమాన్యం ఉద్యోగులపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని, యాజమాన్యం మొండివైఖరి విడనాడాలని, ఉద్యోగుల సంక్షేమానికి చర్యలు తీసుకోవాలని నాయకులు పేర్కొన్నారు. ఆదివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ధర్నా నిర్వహించనున్నట్టు వెల్లడించారు. ఉద్యోగులు భారీసంఖ్యలో పాల్గొనాలని కోరారు.

కార్మికులకు జీతాలు చెల్లించాలని సీఎంకు లేఖ

ఉక్కుటౌన్‌షిప్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : విశాఖ స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులకు, కాంట్రాక్టు కార్మికులకు జీతాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని ఎన్డీఏ కూటమి కార్మిక సంఘ నాయకులు శుక్రవారం ముఖ్యమంత్రి చంద్రబాబు,ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, కేంద్ర ఉక్కు శాఖ మంత్రి కుమరస్వామి, సహాయంత్రి శ్రీనివాసవర్మకు లేఖలు రాశారు. కార్మికులకు జీతాలు లేక చాలా ఇబ్బందులు పడుతున్నారని, ప్రస్తుతం రోడ్డెక్కి జీతాల కోసం అడుక్కునే పరిస్థితివచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులకు న్యాయం చేయాలని కోరారు. లేఖలు రాసిన వారిలో కూటమి యూనియన్‌లు బీఎంఎస్, టీఎన్‌టీయూసీ, డీఎస్ఈయూ, వీఎఎస్‌పీఈయూ, వీయుఎస్ఎస్ ఉన్నాయి.

దుర్గమాంబకు పూజలు



అగనంపూడి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 85వ వార్డు పరిధి అగనంపూడి ఉక్కు నిర్వాసిత గ్రామాల ఆరాధ్య దేవత దుర్గమాంబ ఆలయంలో శుక్రవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా నిర్వాహకులు అమ్మవారిని నూతన వస్త్రాలు, పుష్పాలతో అలంకరించారు. పరసర ప్రాంత గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకొని పసుపు, కుంకుమలు,చీరలు సమర్పించి పూజలు చేశారు. స్థానిక బొర్రమాంబ పారాయణ సేవా సమితి మహిళలు ఆలయంలో లలితా పారాయణం, విష్ణుసహస్ర నామా పారాయణాన్ని అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మెన్ చిత్తా గణేశ్, పారాయణ సేవా సమితి ఆర్గనైజర్ చిత్తా రామారావు, తదితరులు పాల్గొన్నారు.

డంపింగ్‌యార్డులా ప్రధాన రహదారి

- ఇండస్ట్రియల్ ఎస్టేట్ ప్రాంతంలో రోడ్డు పక్కనే నిర్మాణ వ్యర్థాలు
- తొలగించినా.. రాత్రి వేళల్లో మళ్లీ డంపింగ్ చేస్తున్న స్థానికులు
- అపరిశుభ్రత నెలకొనడంతో దుర్గంధం



ఇండస్ట్రియల్ ఎస్టేట్ ప్రధాన రోడ్డుపొడవునా ఉన్న డెబ్రిస్, వ్యర్థాల గుట్టలు

పెదగంట్యాడ, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : పెదగంట్యాడ ఇండస్ట్రియల్ ఎస్టేట్ ప్రధాన రహదారి డంపింగ్ యార్డులా తయారైంది. రోడ్డుకు ఇరువైపులా డెబ్రిస్, ఇతర వ్యర్థాలు గుట్టలుగా కనిపిస్తున్నాయి. నిర్మాణ, శిథిల భవనాల వ్యర్థాలను ఇక్కడ తెచ్చి పడేస్తుండడం రోజురోజుకూ గుట్టలుగా పేరుకుపోతున్నాయి. ఈ రోడ్డు పక్కన డెబ్రిస్, వ్యర్థాల గుట్టలు లేకుండా చేయాలని జీవీఎంసీ ప్రజారోగ్యశాఖ చేస్తున్న ప్రయత్నాలు ఫలించడం లేదు. సుమారు కిలోమీటరు పొడవున ఉన్న ఈ రోడ్డుకు ఇరువైపులా ఖాళీ స్థలం ఉంది. భవిష్యత్తు అవసరాల దృష్ట్యా ఏపీఐఐసీ ఈ స్థలాన్ని రిజర్వు చేసి ఉంచింది. పారిశ్రామిక వాడ రద్దీ పెరిగితే అందుకు అనుగుణంగా రోడ్డును విస్తరించేందుకు ఈ స్థలం ఉపయోగపడుతుందన్నది యోచన. అయతే పరిసర ప్రాంతాల్లో ఎవరు పాతభవనం తొలగించినా, నిర్మాణాలు చేపట్టినప్పుడు ఆ వ్యర్థాలను రాత్రివేళల్లో లారీలతో తెచ్చి రోడ్డు పక్కనే వేస్తున్నారు. తమ ఇళ్లల్లోని వ్యర్థాలను సైతం ఇక్కడే పడేస్తున్నారు. అలాగే కుక్కలు, పందులు, ఇతర జంతు కళేబరాలు కూడా ఇక్కడకే తెచ్చి వేస్తున్నారు. మరి కొందరు ఈ ప్రాంతాన్ని బహిర్భూమిగా వినియోగించుకుంటున్నారు.

పారిశ్రామికవాడకు రాకపోకలు సాగించే కార్మికులకు ఇదే రహదారి. పెదగంట్యాడ నుంచి యాతపాలెం, వెంకన్నపాలెం, కొంగపాలెం, కొత్త దిబ్బపాలెం, అశోక్‌నగర్ కాలనీలకు రాకపోకలు సాగించేందుకు ఈ రోడ్డే ఆధారం. వేమన ఐటీఐ, క్రీడా కోచింగ్ సెంటర్, ఎలక్ట్రికల్ సబ్ స్టేషన్ ఉన్నాయి. వీటికి రాకపోకలు సాగించేవారు ఇదే రోడ్డు నుంచి ప్రయాణించాల్సి ఉంటుంది. అయితే రోడ్డుకు ఇరుపక్కలా నిర్మాణ వ్యర్థాలు పడిపోవడం, కళేబరాల నుంచి వెలువడుతున్న దుర్వాసన ఇబ్బంది పడుతున్నారు. దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన ఆటోనగర్ కస్టమర్లు వచ్చిపోతుంటారు. ఇలాంటి పరిస్థితిలో ఉన్న ప్రధాన రహదారిని చూసి ముక్కు మూసుకోవలసిన పరిస్థితి. పారిశ్రామిక వాడ ప్రధాన రహదారి ఇలాంటి పరిస్థితిలో ఉండటంవల్ల పారిశ్రామిక వాడ ప్రతిష్ట మసకబారుతోంది. రోడ్డుకు ఇరు పక్కల ఉన్న డెబ్రిస్‌ను తొలగించేందుకు జీవీఎంసీ ప్రజారోగ్య విభాగం ప్రయత్నించి పలుమార్లు లారీలు, ప్రొక్లైన్లు వినియోగించారు. పనులు చేపట్టారు. వీరు పగలు తొలగిస్తుంటే... రాత్రికి డెబ్రిస్, వ్యర్థాలు కుప్పలుగా పోసేస్తున్నారు. దీంతో అధికారులు కూడా వదిలేశారు. రాత్రివేళల్లో ఇక్కడ డెబ్రిస్ వేస్తున్న వారిని నియంత్రించాలని స్థానికులు సూచిస్తున్నారు. ఇప్పటికైనా జీవీఎంసీ అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

కార్తీకమాసం వైదిక కార్యక్రమాల పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు

పెదగంట్యాడ, నవంబరు 8 : కార్తీకమాసం వైదిక కార్యక్రమాల్లో భాగంగా ఈ నెల 17న శ్రీనూకాంబికా అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ ప్రకటించింది. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను శుక్రవారం ఆలయం ఆవరణలో ఆవిష్కరించారు. ఆ రోజు అమ్మవారికి పంచామృత అభిషేకం, సామూహిక సత్యనారాయణ వ్రతాలు, 365 ఒత్తులతో కార్తీక దీపరాధన చేపట్టనున్నట్టు తెలిపారు. అదే రోజు మధ్యాహ్నం పూజాకర్తలకు, వారి కుటుంబీకులకు అన్నప్రసాద వితరణ జరుగుతుందని, సాయంత్రం వేదమంత్రాల పూర్వకంగా 5,000 దీపాలతో శివ, కేశవ, నూకాంబికా అమ్మవారిని ఆరాధించడం జరుగుతుందని, భక్తుల చేతుల మీదుగానే పంచసహస్ర దీపాలంకరణ సేవకార్యక్రమం జరుగుతుందని పేర్కొన్నారు. పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో ప్రధాన అర్చకులు రవికుమార్ శర్మ, ఆలయకమిటీ సభ్యులు బెల్లాల వెంకటరావు,బొడ్డు కృష్ణారావు, బెల్లాల నాగేశ్వరరావు, కొత్త సూర్యనారాయణ, కడిమిశెట్టి సూర్యప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.

ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు అచ్యుతరావు అరెస్టు, విడుదల

పెదగంట్యాడ, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు కె.అచ్యుతరావును పెదగంట్యాడ న్యూపోర్టు పోలీసులు శుక్రవారం ఉదయం హౌస్ అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. విజయవాడలో శనివారం జరగనున్న వలంటీర్ల ఆవేదన సదస్సుకు హాజరు కాకుండా ముందుస్తు చర్యల్లో భాగంగా పోలీసులు అచ్యుతరావును అరెస్టు చేశారు. సాయంత్రం వరకు పోలీస్‌స్టేషన్‌లో ఉంచి సొంతపూచీకత్తుపై నోటీసు ఇచ్చి విడుదల చేశారు. న్యూపోర్టు పోలీస్‌స్టేషన్ సీఐ జి.దాలిబాబు ఈ నోటీసు ఇచ్చారు.

హెచ్‌ఆర్ లీడర్‌షిప్‌పై సదస్సు

అక్కిరెడ్డిపాలెం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): హెచ్‌పీసీఎల్ స్కిల్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్ బొల్లినేని మెడ్‌స్కిల్ ఆధ్వర్యంలో శుక్రవారం హెచ్‌ఆర్ లీడర్‌షిప్ డెవలప్‌మెంట్ కార్యక్రమాన్ని షీలానగర్‌లో నిర్వహించారు. స్కిల్‌డెవలప్‌మెంట్ ఇనిస్టిట్యూట్ సీఈవో ఇంతియాజ్ మాట్లాడుతూ హెచ్‌ఆర్ మేనేజర్లు తమకు ఎదురయ్యే సవాళ్లను అధిగమిస్తే రాణించగలుగుతారన్నారు. నేవల్ డాక్‌యార్డ్ హెచ్‌ఆర్ మేనేజర్ అర్జున్ రాధాకృష్ణ మాట్లాడుతూ ప్రస్తుత డిజిటల్ పోటీ ప్రపంచంలో ఏఐ టెక్నాలజీ మీద అందరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎల్‌పీజీ దక్షిణాసియా మాజీ సీఎఫ్‌వో గిరిధరన్ మాట్లాడుతూ మానవ వనరుల అభివృద్ధిలో మేనేజర్లు కీలకపాత్ర పోషించాలన్నారు. సంస్థ డైరెక్టర్ సీహెచ్ నాగేశ్వరరావు మాట్లాడుతూ కంపెనీ అవసరాలకు అనుగుణంగా వివిధ రకాల నైపుణ్య శిక్షణను వేలాది మంది విద్యార్థులకు ఇస్తున్నామన్నారు. కార్యక్రమంలో వివిధ సంస్థల హెచ్‌ఆర్ మేనేజర్లు పాల్గొన్నారు.

కాలువ నిర్మాణ పనులు పరిశీలించిన కార్పొరేటర్ నాగేశ్వరరావు

సింధియా, నవంబరు 8, (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 40వ వార్డు పరిధిలో కొత్త కాలవ నిర్మాణ పనులును శుక్రవారం స్థానిక కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింధియా-మల్కాపురం చేరుకునే ప్రధాన రోడ్డు మార్గాలలో వర్షం పడినప్పుడు, ఏదైనా పైపులు లీకేజు అయినా రోడ్డు మార్గం అంతా పూర్తిగా బురదతో నిండిపోతోందన్నారు. అలాగేమల్కాపురం పోలీస్టేషన్ నీట మునుగుతుందని, నూతన కాలువ నిర్మాణ పనులు చేపట్టామన్నారు. ఇందుకోసం జీవీఎంసీ రూ.10 లక్షలు కేటాయించిందని తెలిపారు. ఆయన వెంట కాంట్రాక్టర్ శర్మ, వర్క్ ఇన్‌స్పెక్టర్ సురేష్ పాల్గొన్నారు.

ఉక్కు గుర్తింపు యూనియన్ నేతలకు వ్యతిరేకంగా నినాదాలు

ఉక్కుటౌన్‌షిప్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : స్టీల్‌ప్లాంట్ గుర్తింపు యూనియన్ నాయకులకు యువ కార్మికుల సెగ తగిలింగి. ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేదని, దీనిపై యాజమాన్యంతో మాట్లాడి తక్షణమే జీతాలు ఇప్పించాలని కొంత మంది యువ ఉద్యోగులు శుక్రవారం గుర్తింపు యూనియన్ నాయకులను కలిశారు. గుర్తింపు యూనియన్ నాయకులు సరిగ్గా స్పందించలేదని, కార్మికులను చులకన చేసి మాట్లాడారని పేర్కొంటూ గుర్తింపు యూనియన్ నాయకులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ విషయం ఇప్పుడు ప్లాంట్‌లో చర్చనీయాంశంగా మారింది.

2 కిలోల గంజాయి స్వాధీనం

కూర్మన్నపాలెం ,నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : దువ్వాడ రైల్వే స్టేషన్లో గురువారం రాత్రి 2 కిలోల గంజాయి, ఎండీఎంఏ పిస్టల్ 0.5 గ్రాముల పౌడర్‌ను టాస్క్‌ఫోర్సు పోలీసులు పట్టుకొని, నిందితులను దువ్వాడ పోలీసులకు అప్పగించారు ఇందుకు సంబంధించి దువ్వాడ సీఐ మల్లేశ్వరరావు తెలిపిన వివరాలిలా వున్నాయి. శ్రీనగర్‌కు చెందిన మైనర్ల మధుబాబు, పెందుర్తి దరి దగ్గువానిపాలేనికి చెందిన గేదెల నరసింగ వర్మ, ఒడిశాలోని రాయగడకు చెందిన షేక్ మెహబూబ్ వద్ద కొనుగోలు చేసి దువ్వాడలో రైలు దిగి వచ్చారు. అక్కడే ఉన్న పోలీసులను చూసి వారిరువురూ పరుగులు తీయటంతో వారిని వెంబడించి పట్టుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పేకాటరాయుళ్లపై కేసు నమోదు

కూర్మన్నపాలెం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : అగనంపూడి రైల్వే ట్రాక్‌కు సమీపంలో జూదం ఆడుతున్నారన్న ముందస్తు సమాచారంతో గురువారం రాత్రి దువ్వాడ పోలీసులు దాడి చేసి, 9 మందిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుల నుంచి నుంచి రూ.28,000, 9 మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చెత్తకుప్పల్లో మంటలు.. దట్టంగా కమ్ముకున్న పొగ

- ఆకతాయిల పనితో భయాందోళనలకు గురైన స్థానికులు



చెత్తకుప్పలు అంటుకొని ఎగసి పడుతున్న మంటలు, దట్టంగా కమ్ము పొగ

ఆటోనగర్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : అన్న క్యాంటన్ సమీపంలో ఉండే చెత్త డంపింగ్ యార్డులో శుక్రవారం ఆకతాయిలు నిప్పటించడంతో మంటలు ఎగసిపడ్డాయి. దీంతో క్యాంటీన్‌కు భోజనానికి వచ్చిన వారు, స్థానికులు ఆందోళనకు గురయ్యారు. దట్టంగా పొగ కమ్ముకోవడంతో ఉక్కిరిబిక్కిరై ఇబ్బంది పడ్డారు. ఉదయం 11 ప్రాంతంలో కొందరు ఆకతాయిలు స్థానిక డంపింగ్ యార్డులో నిప్పు పెట్టారు. దీంతో మంటలు వ్యాపించి ఈ ప్రాంతమంతా దట్టంగా పొగ కమ్ముకొంది. ఏం జరుగుతుందోనని అంతా ఆందోళనకు గురయ్యారు. మంటలు ఎక్కువ అవుతుండడంతో స్థానికులు ఐలా కమిషనర్ ఎ.కిషోర్‌కు సమాచారం అందించారు. చాలా సేపటి తర్వాత మంటలు అదుపులోకి వచ్చాయి. ఈ దుశ్చర్యకు పాల్పడిన వారిని గుర్తించి చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఐలా కమిషనర్ కిశోర్ చెప్పారు.

విజ్ఞాన్ విద్యార్థులు డీఆర్డీవో సందర్శన



డీఆర్డీవో వద్ద విజ్ఞాన్ కళాశాల విద్యార్థులు

అగనంపూడి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : దువ్వాడలోని విజ్ఞాన్ ఇంజనీరింగ్ కళాశాల ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ తృతీయ సంవత్సరం విద్యార్థులు 50 మంది శుక్రవారం బెంగళూరులో గల డిఫెన్స్ రిసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ (డీఆర్డీవో)ను సందర్శించారు. సాంకేతిక నైపుణ్యాలకు సంబంధించిన అం శాలపై అధ్యయనం చేశారు. విద్యార్థులకు నైపుణ్యాభివృద్ధి పెంపొదించేందుకు ఇటువంటి పారిశ్రామిక సందర్శన ఎంతగానో దోహపడుతుందని ప్రిన్సిపాల్ జె.సుధాకర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రెక్టార్ వి.మధుసూదనరావు, హెచ్‌వోడీ సీహెచ్. రమేశ్‌బాబు, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

ఆటో బోల్తా : డ్రైవర్‌కు గాయాలు



గాయపడిన శ్రీనివాస్

ఉక్కుటౌన్‌షిప్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : స్టీల్‌ప్లాంట్ ప్రధానమార్గంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆటో బోల్తా పడింది. డ్రైవర్‌కు గాయాలయ్యాయి. గాజువాక ప్రాంతానికి చెందిన ఆటోడ్రైవర్ వై.శ్రీనివాసరావు తన ఆటోలో శుక్రవారం గాజువాక నుంచి దేశపాత్రునిపాలెం వైపు వెళ్తుండగా, సెక్టార్ -10 పెట్రోల్ బంకు దాటిన తరువాత ఆటో డివైడర్‌ను ఢీకొని బోల్తా పడింది.దీంతో శ్రీనివాసరావు గాయపడ్డారు. అతన్ని గాజువాకలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు.

సినిమా గైడ్

● **అపుడో, ఇప్పుడో, ఎప్పుడో :** కిన్నెర, సంగం, గోకుల్, మౌర్య (గోపాలపట్నం) కన్య కాంప్లెక్స్ (గాజువాక) లిఖిత (శ్రీహరిపురం),
● **ధూం, ధాం :** శారద, మోహిని (గాజువాక)
● **జితేందర్‌రెడ్డి :** శ్రీనరసింహ (గోపాలపట్నం), హెవెన్-3 (గాజువాక)
● **క :** జగదాంబ, శ్రీరామ, ఊర్వశి (కంచరపాలెం), సౌజన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), గణేష్ (తగరపువలస)
● **లక్కీ భాస్కర్:** మెలోడి, శరత్,కామేశ్వరి, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), శ్రీరాములమ్మ (తగరపువలస)
● **అమరన్ :** శ్రీవెంకటేశ్వర, శ్రీకన్య, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), మోహిని కాంప్లెక్స్‌నటరాజ్-1 (పెందుర్తి), సప్తగిరి (తగరపువలస)
● **బఘీర :** వెంకటేశ్వర, శ్రీకన్య కాంప్లెక్స్ (గాజువాక), సీతారామయ్య (పరవాడ)
● **దేవర :** రమాదేవి, శ్రీకన్య (గాజువాక). తాతా (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 54, టమాటా 34, వంకాయలు (తెలుపు) 34, వంకాయలు (నలుపు) 50, బెండకాయలు 36, పచ్చిమిర్చి 36, కాకరకాయలు 38, బీరకాయలు 30, ఆనపకాయలు 26, కాలీఫ్లవర్ 60, క్యాబేజి 34, క్యారెట్ 62 దొండకాయలు 28, బంగాళదుంపలు 40, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 44, అల్లం (పాతది)60, బరబటి 34, ముల్లంగి 26, నిమ్మకాయలు (కిలో) 76, గోరుచిక్కుడు 40, దోసకాయ 38, వెల్లుల్లి (పెద్దవి) 290, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 76, పొటల్స్ 42, కీరదోస 28, కాప్సికమ్ 78, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 48, చిలగడదుంపలు 30, కంద 72, దేముడు చిక్కుడు 72, కొండఉసిరి 70, కరివేపాకు (కిలో) 45, కొత్తిమీర (పెద్దకట్ట) 35, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 100, బూడిద గుమ్మడికాయ 30, క్యాప్సికం 45, మామిడి అల్లం 60, బొప్పాయి 40, జామకాయలు (కిలో) 45.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)	
విశాఖపట్నం	550
విజయనగరం	554
శ్రీకాకుళం	554

చికెన్ ధరలు	
బ్యాగ్	
రైతు ధర	107
ఫారం ధర	123
విత్ స్కిన్	224
స్కిన్‌లెస్	234

కొత్తపాలెం అండర్ పాస్‌వేలో పారిశుధ్య పనులు

గోపాలపట్నం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : గత నెలలో కురిసిన వర్షాలకు కొత్తపాలెం అండర్‌పాస్‌వేలో మట్టి పేరుకుపోయి వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. ఈమేరకు జీవీఎంసీ సిబ్బంది శుక్రవారం అండర్‌పాస్‌వేలో పేరుకుపోయిన మట్టిని తొలగించారు. అలాగే పాదచారులు రాకపోకలు సాగించే ఫుట్‌పాత్ మార్గంలో చెత్తను, తుప్పలను తొలగించి, పరిసరాలను శుభ్రం చేశారు.

మర్రిపాలెంలో శివాలయం శిఖరాగ్ర పూజలు

ఎన్ఏడీ జంక్షన్,నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 52వ వార్డు మర్రిపాలెం ఉడా లేఅవుట్ కాలనీలో నూతనంగా నిర్మిస్తున్న శివాలయం శిఖరాగ్ర పూజలు శుక్రవారం జరిగాయి. వేద పండితులు శాస్త్రోక్తంగా శిఖరాగ్ర పూజ చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ మాట్లాడుతూ ఆలయంలో పార్వతీ పరమేశ్వరులతో పాటు సుబ్రహ్మణ్యస్వామి, లలితా దేవి విగ్రహాలను ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో ఆసోసియేషన్ సభ్యులు ఎం. వాసుదేవరావు, రవికుమార్, సురేశ్, తదితరులు పాల్గొన్నారు.

నేడు శ్రవణ నక్షత్రం పూజలు

వేపగుంట, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : నాయుడుతోట రవినగర్ శేషాద్రి కొండపై నెలకొన్న కల్యాణ వెంకన్నస్వామి ఆలయంలో స్వామివారి జన్మ నక్షత్రం శ్రవణం పురస్కరించుకొని శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్టు ఆలయ అర్చకుడు శేషాద్రి శర్మ తెలిపారు. శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రత్యేక పూజలు, అర్చనలు అనంతరం మధ్యాహ్నం అన్నసంతర్పణ, సాయంత్రం సామూహిక విష్ణు సహస్రనామ పారాయణం ఉంటాయన్నారు.

కప్ప స్తంభం ఆదాయం రూ. 6.9 లక్షలు

సింహాచలం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామి ఖజానాకు కప్ప స్తంభం ద్వారా గత నెలలో రూ. 6. 9 లక్షల ఆదాయం సమకూరింది. దేవస్థానం రికార్డుల ప్రకారం గత నెల 27824 మంది కప్ప స్తంభాన్ని ఆలింగనం చేసుకోవడం వల్ల రూ.6,95, 600 ఆదాయం లభించింది.

డిజిటల్ రంగంలో యువతకు ప్రోత్సాహం

పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గణబాబు

మల్కాపురం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : డిజిటల్, స్మార్ట్ రంగాల్లో విద్యార్థులకు వృతి నైపుణ్యాలను మరింత మెరుగుపరచడమే ధ్యేయంగా సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ ఇన్ మారీటైమ్ అండ్ షిప్‌బిల్డింగ్ (సీఈఎంఎస్) సంస్థ పని చేస్తుందని పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు అన్నారు. ఇక్కడి సీఈఎంఎస్ కేంద్రంలో వివిధ ఇంజనీరింగ్ కళాశాలల ఫ్యాకల్టీలతో శుక్రవారం ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం స్కిల్ డెవలప్‌మెంట్ పేరుతో అనేక రంగాల్లో యువతను ప్రోత్సహిస్తుందని తెలిపారు. అదే మాదిరి విశాఖలో సీఈఎంఎస్‌కు ప్రోత్సాహం అందిస్తామని చెప్పారు. అనంతరం ఏపీఎస్‌సీహెచ్‌ఈ సంస్థ చైర్మన్ రామ్మోహన్‌రావు వర్చువల్ విధానంలో మాట్లాడుతూ విశాఖ హిందుస్థాన్ షిప్‌యార్డుకు సమీపంలో ఈ సంస్థను ఏర్పాటు చేయడం వెనుక మంచి ఆలోచన ఉందని తెలిపారు. సంస్థలో చేరిన విద్యార్థులకు సముద్రయానంపై అవగాహన కల్పించడంతో పాటు అత్యాధునిక సాంకేతిక రంగంలో ఎలా ముందుకు దూసుకువెళ్లాలన్న దానిపై శిక్షణ ఇస్తామని చెప్పారు. అనంతరం ఫ్యాకల్టీలకు పలు అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బుల్లయ్య కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ జి. మధుకుమార్, సీఈఎంఎస్ ప్రతినిధి గోపీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



మాక్ డ్రిల్‌ను పరిశీలిస్తున్న డీఆర్‌ఎం సౌరభ్ ప్రసాద్



ఎన్‌డీఆర్ఎఫ్ బృందం సహాయక చర్యలు

ఆకట్టుకున్న రైల్వే అధికారుల మాక్ డ్రిల్

గోపాలపట్నం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : సింహాచలం రైల్వేస్టేషన్ రెండవ నెంబరు ప్లాట్‌ఫారమ్‌కు వెనుక భాగంలో ఉన్న గూడ్స్ లైన్‌లో శుక్రవారం ఉదయం రైల్వే అధికారులు ప్రదర్శించిన మాక్ డ్రిల్ అబ్బురపరిచింది. స్టేషన్‌లో జరిగిన మాక్ డ్రిల్‌లో భాగంగా నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్‌బుల్ ఫోర్స్ (ఎన్‌డీఆర్ఎఫ్), రైల్వే శాఖ సివిల్ డిఫెన్స్ ఆర్గనైజేషన్ చేసిన సాహస విన్యాసాలు ఎంతగానో ఆకర్షించాయి. ఎన్డీఆర్ఎఫ్ వద్ద ఉన్న అధునాతన పరికరాలతో చేసిన సాహస విన్యాసాలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా డీఆర్‌ఎం సౌరభ్ ప్రసాద్ మాట్లాడుతూ రైల్వే శాఖలో అనుకోకుండా జరిగే ప్రమాదాల సమయంలో సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించడానికి ఇటువంటి మాక్ డ్రిల్‌లు ఉప యోగపడతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏడీఆర్ఎం మనోజ్ కుమార్ సాహూ, సీనియర్ డివిజనల్ సేఫ్టీ ఆఫీసర్ సిద్ధార్థ్ ప్రధాన్, ఎన్‌డీఆర్ఎఫ్, సివిల్ డిఫెన్స్ రైల్వే శాఖకు చెందిన సేఫ్టీ, ఎలక్ట్రికల్, కమర్షియల్, మెడికల్ డిపార్ట్‌మెంట్ల సిబ్బంది పాల్గొన్నారు.

వైసీపీ కార్యకర్తలతో సమావేశం



కార్యకర్తల సమావేశంలో పాల్గొన్న అదీప్‌రాజ్

పెందుర్తి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : కూటమి నాయకులు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజలను మోసం చేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ విమర్శించారు. శుక్రవారం ఆయన రాంపురంలో ఉన్న వైసీపీ కార్యాలయంలో 95, 97 వార్డుల్లోని కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వార్డుల్లో పార్టీ బలోపేతం, కూటమి మోసపూరిత హామీలను ప్రజల్లోకి తీసుకువెళ్లడం తదితర అంశాలపై చర్చించారు.



శంకుస్థాపన శిలాఫలకాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే రమేశ్‌బాబు

పెందుర్తి అభివృద్ధికి ప్రణాళిక : ఎమ్మెల్యే పంచకర్ల

పెందుర్తి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : పెందుర్తి అభివృద్ధికి పక్కా ప్రణాళికతో కృషి చేస్తానని ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు అన్నారు. శుక్రవారం ఆయన 96వ వార్డులో రూ. 5.50 కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు కార్పొరేటర్ పీలా శ్రీనివాసరావుతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పెందుర్తి పరిధిలో ఉన్న వార్డుల్లో రూ. వంద కోట్లతో పనులు చేపట్టనున్నామన్నారు. వీటిని శంకుస్థాపనలతో సరిపెట్టకుండా పనులు పూర్తి చేసి వంద రోజుల్లో ప్రారంభోత్సవాలు కూడా నిర్వహిస్తామని చెప్పారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా మౌలిక వసతుల కల్పనకు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ దృష్టికి తీసుకువెళ్లి నిధుల మంజూరుకు కృషి చేస్తానన్నారు. అనంతరం ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. కార్యక్రమంలో జనసేన నాయకులు గొర్లె అప్పారావు, ఆర్ఎస్ నాయుడు, సేనాపతి సోమశేఖర్, బీజేపీ ఇన్‌చార్జి గొర్లె రామునాయుడు. టీడీపీ నేతలు ఆళ్ల రాము, ఆళ్ల రమేశ్, పెంటకోట రాజేంద్రప్రసాద్, పీలా జితేంద్ర, కిల్లి రమేశ్, బయిలపూడి హరగోపాల్, తదితరులు పాల్గొన్నారు.

చట్ట సభల్లో యాదవులకు ప్రాధాన్యం : అక్కరమాని



మాట్లాడుతున్న జిల్లా యాదవ సంఘం అధ్యక్షుడు వెంకటరావు

పెందుర్తి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు అన్నిరంగాల్లోనూ యాదవుల ప్రాధాన్యత పెరిగేలా కృషి చేస్తామని జిల్లా యాదవ సంక్షేమ సంఘం అధ్యక్షుడు అక్కరమాని వెంకట్రావు అన్నారు.ఈనెల 15న సంఘ ఆధ్వర్యంలో ఆర్కేబీచ్‌లో జరగనున్న రాధాకృష్ణ మహోత్సవం వేడుకల నేపథ్యంలో చినముషిడివాడలో ఉన్న జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి యాదవ సంఘం జిల్లా ప్రతినిధి సింహాచలంను కలిశారు.ఈ సందర్భంగా పెందుర్తిలోని యాదవ సంఘం నేతలతో ఆయన సమావేశమయ్యారు, చట్ట సభల్లో యాదవుల ప్రాధాన్యత పెరగాల్సిన అవసరం ఉందన్నారు. ఆర్కేబీచ్‌లో జరిగే రాధాకృష్ణ మహోత్సవాన్ని విజయవంతం చేయాలని కోరారు. అనంతరం .జనసేన నేత సింహాచలం, తదితరులు వెంకటరావును సత్కరించి, జ్ఞాపిక అందజేశారు, ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు ఉప్పిలి దేవి కనకరాజు, చలపతి, అయితి ఎర్నిబాబు, రాంబాబు, విష్ణు, గొలగాని సంతోశ్, మాధవ్, భీమేశ్, లక్కీ గోవింద్, తదితరులు పాల్గొన్నారు.

ఈత కొట్టు... ఆరోగ్యం పట్టు!



స్విమ్మింగ్‌తో చక్కని శరీర సౌష్ఠవం



ఆరోగ్యమే మహా భాగ్యం. సరైన ఆహార అలవాట్లు, తగినంత విశ్రాంతి, క్రమం తప్పని వ్యాయామంతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యం. ఇందులో వ్యాయామం పాత్ర ఎక్కువ. జిమ్‌కి వెళ్లడం, వాకింగ్, రన్నింగ్, యోగా, ఏరోబిక్స్ తదితర అంశాలు ఆరోగ్యానికి దోహదపడేవే. అయితే వీటన్నింటికీ భిన్నంగా మరింత మెరుగైన ఆరోగ్యంతో పాటు ఆనందాన్నిచ్చేది స్విమ్మింగ్. - ఎండాడ-ఆంధ్రజ్యోతి

వాతావరణంలో మార్పుల కారణంగా ఉష్ణోగ్రతలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. ఈ పరిస్థితిలో ఈత కొడితే ఆ హాయే వేరు. ఈత అద్భుత శారీరక వ్యాయామని సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రోల్ అండ్ ప్రివెన్షన్ పేర్కొంది. వారంలో కనీసం 40 నిమిషాల నుంచి గంట సమయం ఈతకు కేటాయిస్తూ కనీసం మూడు నెలలు పాటించగలిగితే సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని ఓ అధ్యయనం తేల్చింది. ఈత కొట్టడం వల్ల మానసిక, శారీరక ఆరోగ్యానికి మేలు జరుగుతుందని, కేన్సర్, డయాబిటిస్, డిప్రెషన్, హార్ట్ సమస్యలు, ఎముకల సంబంధిత వ్యాధుల తీవ్రతను తగ్గిస్తుందని నిపుణులు చెబుతున్నారు.

ఈత కొట్టే విధానాలివి...

తరచూ స్విమ్మింగ్ చేయడం వల్ల శరీరంలోని అనేక కండరాల్లో చురుకుదనం వస్తుంది. స్విమ్మింగ్‌లో సాంకేతికంగా తేడాలుంటాయి. శరీర భాగాల సమన్వయంతో, లయబద్ధంగా కదలికలుంటాయి. మొండెం, చేతులు కాళ్లు, పాదాలను పలురకాలుగా వినియోగించాల్సి ఉంటుంది. ఫ్రీస్టైల్ విధానంలో ఎలా అయినా ఈత కొట్టేందుకు వీలుంటుంది. బ్రెస్ట్ స్ట్రోక్‌లో ఛాతీ నుంచి బలాన్ని ప్రయోగించాలి. బటర్ ఫ్లై స్టైల్‌లో శరీరంలోని భాగాలన్నీ వినియోగించాలి. సైడ్ స్ట్రోక్‌లో ఒక చేయి ఎప్పుడూ నీటిలో ఉంచి, మరో చేతిని ఉపయోగించి స్విమ్మింగ్ చేయాలి. ఫ్రీస్టైల్ స్విమ్మింగ్‌లో చాలాసేపు ఈత కొట్టాలంటే పొత్తి కడుపు (కోర్ అబ్డామినల్), శరీర భాగం మరో వైపు తిప్పడంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తాయి. హిప్ ఫ్లెక్సర్ కాంపాక్ట్ స్థిరమైన కిక్‌కు ఉపయోగపడుతుంది. ఫ్రీ స్టైల్ బ్యాక్ స్ట్రోక్ స్విమ్మింగ్‌లో ఈతగాళ్లు తమ వీపుపైన పడుకుని ఈత కొట్టాలి. చేతులను కాళ్లను తిరుగుతున్నట్టుగా కదిలించాలి. ఇందులో వెల్లికిల్లా పడుకుని వెనుకకు తిరిగి ఈత కొట్టాల్సి ఉంటుంది. వెన్ను సమస్యలతో బాధపడేవారికి ఈ పద్ధతి దోహదపడుతుంది.

బటర్‌ఫ్లై స్ట్రోక్‌తో వెయిట్ లాస్

బటర్ ఫ్లై స్ట్రోక్‌తో వెయిట్ లాస్ అవుతుంది. రోజూ పది నిమిషాలు చేస్తే సుమారు 140 క్యాలరీలు ఖర్చవుతాయి. పెక్స్, లాట్స్, క్వాడ్‌లు, భుజాలు, బైసెప్స్, ట్రైసెప్స్‌కు సంబంధించిన అన్ని కండరాలు పనిచేస్తాయి. తల నీళ్లలోంచి, శరీరం నిటారుగా ఉండాలి. చేతులు, కాళ్లను కప్పలు నీటిలో ఈదుతున్నట్టుగా ఉపయోగించాలి. పెక్టోరల్, లాటిస్సిమస్ డోర్సీ కండరాలు నీటికి వ్యతిరేకంగా చేతులను లోపలకు తిప్పడానికి ఉపయోగించాల్సి ఉంటుంది. బ్రెస్ట్‌స్ట్రోక్ కిక్ ఇవ్వడంలో గ్లూట్స్‌తో పాటు క్వాడ్రిసెప్స్ కండరాలను ఉపయోగించాలి.

నిత్యం ఫిట్‌గా ఉండేలా దోహదం

దీర్ఘకాలిక వ్యాధులను దూరం చేసే వ్యాయామం

ఊపిరితిత్తులకు మేలు

రన్నర్స్‌లో కంటే స్విమ్మర్స్‌లో ఊపిరితిత్తుల పనితీరు బలపడుతుందని ఫిజియాలజిస్టులు పేర్కొంటున్నారు. ఆక్సిజన్ పరిమాణాన్ని పెంచడంలో కీలకంగా మారుతుందన్నారు. స్విమ్మింగ్ చేసేటప్పుడు ఊపిరితిత్తులు చాలా చురుగ్గా పనిచేస్తాయి. లోతైన శ్వాసను తీసుకోవడం, ఎక్కువసేపు బిగపట్టడంతో ఊపిరితిత్తుల సామర్థ్యం పెరుగుతుంది. శ్వాస సామర్థ్యం పెరుగుతుంది. ఈ వ్యాయామాలతో ఆస్తమా రోగులకు కూడా మేలు జరుగుతుంది.

మానసిక ఆనందానికి ...

ఈతతో మంచి అనుభూతిని కల్గించే హార్మోన్లు ఎండార్ఫిన్లను పెరుగుతాయి. ఒత్తిడి హార్మోన్లు, అడ్రినలిన్, కార్టిసాల్‌లను తగ్గిస్తుంది. మానసిక స్థితి, ఆందోళన, ఒత్తిడి, నిరాశ, డయాబిటిస్ నియంత్రించడానికి ఉపయోగపడుతుంది. కీళ్ల నొప్పులు, గుండె జబ్బుల నివారణకు దోహదపడుతుంది. రాత్రివేళ మంచి నిద్ర పడుతుంది. మహిళలు ప్రతిరోజూ కనీసం 30 నిమిషాలు స్విమ్మింగ్ చేస్తు గుండె సంబంధిత వ్యాధులకు పూర్తిగా దూరమయ్యే అవకాశం ఉంది.

ఇవి పాటించాలి

ఈత రాని వారు ట్రైనర్ సహాయం తీసుకోవాలి. ఈతకు వెళ్లేటప్పుడు నాణ్యమైన గాగుల్స్ తలకు టోపీ ధరించాలి. ముందుగా స్నానం చేసిన తర్వాత మాత్రమే స్విమ్మింగ్ పూల్‌లోకి ప్రవేశించాలి. బయటకు వచ్చిన తర్వాత మళ్లీ స్నానం చేయాలి. స్విమ్మింగ్ చేసేటప్పుడు శరీరం డీహైడ్రేట్ అవుతుంది. కానీ ఆ సమయంలో చెమట కనిపించదు. కాబట్టి నీటిని అవసరమైన పరిమాణంలో తీసుకోవాలి. సన్‌బర్న్, టానింగ్ నుంచి శరీరాన్ని రక్షించుకోవడానికి ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల మధ్య స్విమ్మింగ్ చేయకపోవడం మంచిది. చర్మం, జుట్టు పొడిబారకుండా ఉండాలంటే వాటర్ ప్రూఫ్ మాయిశ్చరైజర్లు వినియోగించాలి. ఈత కొట్టడానికి వెళ్లేటప్పుడు పరిశుభ్రమైన స్విమ్మింగ్ పూల్‌ని ఎంచుకోవాలి. పూల్ నిర్వహణపై సమగ్ర వివరాలు సేకరించాలి. ఈతకు శక్తి అవసరం. అందుకు తగ్గ ఆహారాన్ని తీసుకోవాలి. కండరాలలో అసౌకర్యంగా అనిపిస్తే ట్రైనర్ సలహా మేరకు స్విమ్మింగ్ చేయాలి.

అందుబాటులో ఆక్వా స్పోర్ట్స్ కాంప్లెక్స్



స్విమ్మింగ్ మీద మక్కువ ఉన్న వారు నగరంలోని ఆర్కే బీచ్ రోడ్డులోని ఆక్వా స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో శిక్షణ పొందే వీలుంది. నెలకు రూ.1.500 వసూలు చేస్తారు. ప్రొఫెషనల్స్ రూ.2,500, అడ్వాన్స్‌డ్ పేరుతో నెలకు రూ.4 వేలు తీసుకుంటున్నారు. ఆసక్తి ఉన్న వారు మూడు నెలలకు 18 శాతం జీఎస్టీతో కలిసి రూ.2,655, ఆరు నెలలకు రూ.5,310, ఏడాదికి రూ.10,620 చెల్లించాల్సి ఉంటుంది. ప్రతిరోజూ ఉదయం ఆరు నుంచి 9, మధ్యాహ్నం 4 నుంచి రాత్రి 9 గంటల వరకు స్విమ్మింగ్ చేసుకునే అవకాశం కల్పిస్తున్నారు. వివరాలకు 0891-2567413 నంబరులో సంప్రతించవచ్చు. కాగా ఆరేళ్ల నుంచి పదేళ్ల మధ్య వయసు గల చిన్నారులకు జీఎస్టీతో కలిసి మూడు నెలలకు రూ.1,770 చెల్లిస్తే చాలు. దీంతో పాటు వేసవికాలంలో కొన్ని ప్రధాన హోటల్స్ సమ్మర్ కోర్సు పేరుతో స్విమ్మింగ్ శిక్షణ ఇస్తున్నాయి.



నేటి నుంచి రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీలు

కూర్మన్నపాలెం,నవంబరు 8 (ఆంధ్రజ్యోతి):కణితి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం నుంచి స్కూలు గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో 68వ రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ అండర్-14 బాల, బాలికల నెట్‌బాల్ పోటీలు జరగనున్నాయి. జెర్సీలను టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొండా జగన్ ఆవిష్కరించారు. పోటీల్లో 13 జిల్లాల నుంచి సుమారు 312 మంది క్రీడాకారులు పాల్గొంటారన్నారు. ఉదయం 10 నుంచి రాత్రి 10 గంటల వరకూ నిర్వహిస్తామన్నారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన జట్లకు డిసెంబరు 2 నుంచి 6 వరకూ ఛత్తీస్‌గఢ్ ఖుర్బాలో జరగనున్న జాతీయస్థాయి నెట్‌బాల్ పోటీల్లో పాల్గొనే అవకాశం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో విజయరామరాజు, రాజన్‌రాజు, వెంకటరమణ, మన్నాజీ, నరసింగరావు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్య సేవలందాలి

» మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు

మహారాణిపేట, నవంబరు8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్య సేవలందాలని మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు అన్నారు. నోవాటెల్‌లో జరుగుతున్న ఎండోక్రైనాలజిస్టుల ఎండోక్రైన్ సొసైటీ ఆఫ్ ఇండియా 53వ జాతీయ సదస్సుకు శుక్రవారం ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశంలో ఎక్కువ శాతం మంది మధుమేహం, థైరాయిడ్ బారిన పడుతున్నారని, ఈ నేపథ్యంలో ప్రజలు జీవన విధానాన్ని మార్చుకోవాలన్నారు. ఈఎస్ఐ ఎండోక్రైనాలజీ టెస్టుబుక్‌ను ఆవిష్కరించారు. ప్రజలకు వ్యాధులపై అవగాహన కల్పించిన అనంతరం వైద్యులు చికిత్స చేయాలని సూచించారు, కార్పొరేట్ ఆస్పత్రుల్లోని వైద్యులు అవసరం లేకున్నా అనేక వైద్య పరీక్షలు చేయిస్తున్నారని, ఈ విధానం మారాలన్నారు. మొబైల్ ఫోన్ అతివినియోగంతో తీవ్ర ఒత్తిడికి గురవుతూ ఎంతో మంది వ్యాధులబారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సదస్సుకు, జాతీయ అంతర్జాతీయ ఎండోక్రైనాలజీ నిపుణులు హాజరయ్యారు. సదస్సులో డాక్టర్ వీకే జబ్బరు, డాక్టర్ కేవీఎస్ హరికుమార్, డాక్టర్ జయంతి రమేశ్, డాక్టర్ కేఏవీ సుబ్రహ్మణ్యం, డాక్టర్ దిలీప్‌కుమార్, డాక్టర్ మైథిలి, డాక్టర్ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.



ఎండోక్రైనాలజీ టెస్టుబుక్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు



వైసీపీ మునిగిపోయే నావ

» భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

కొమ్మాది, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): వైసీపీ మునిగిపోయే నావ అని మాజీ మంత్రి, భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఎద్దేవా చేశారు. శుక్రవారం ఆయన జోన్ 2 కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. వైసీపీ మళ్లీ అధికారంలోకి వస్తుందని పగటి కలలు కంటున్న జగన్‌కు ప్రస్తుతం 175 నియోజకవర్గాల్లో కనీసం సమన్వయకర్తలు కూడా దొరకని పరిస్థితి ఉందని విమర్శించారు. పార్టీలోని ముఖ్య నాయకులంతా వేరే పార్టీలకు వెళ్లిపోతున్నారని చెప్పారు. కూటమి నేతల మధ్య గొడవలు జరిగి విడిపోతారని ఎదురుచూస్తున్న జగన్ ఆశలు ఎప్పటికీ నెరవేరవన్నారు. ముఖ్య మంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పరస్పర అవగాహన, మంచి మైత్రీ బంధంతో ముందుకు వెళుతున్నారని తెలిపారు. ప్రజాస్వామ్యం, మానవత్వం, మంచితనం గురించి జగన్ మాట్లాడుతుంటే దెయ్యాలు వేదాలు చెప్పినట్టు ఉందన్నారు. అనంతరం గత అసెంబ్లీ సమావేశంలో జగన్ అహంకారపూరితంగా మాట్లాడిన వీడియోను ప్రదర్శించారు. కాగా మధురవాడ లో ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురవుతున్నా, రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదని విలేకరులు ఆయన దృష్టికి తీసుకువెళ్లగా ఆక్రమణలకు పాల్పడితే ఎంతటి వారినైనా ఉపేక్షించమని చెప్పారు. త్వరలోనే స్పెషల్ డ్రైవ్ నిర్వహించి, ఆక్రమణలను తొలగిస్తామన్నారు.



జగన్ మాట్లాడిన వీడియోను చూపిస్తున్న ఎమ్మెల్యే గంటా

ఏసీబీ వలలో తామరం వీఆర్వో

» మ్యుటేషన్‌కు రూ.15 వేలు డిమాండ్

» డబ్బులు తీసుకుని బావమరిదికి ఇచ్చిన వీఆర్వో

» ఇద్దరినీ అరెస్టు చేసిన ఏసీబీ అధికారులు



వీఆర్వో లక్ష్మణరావు

మాకవరపాలెం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): భూమి మ్యుటేషన్ (రికార్డుల్లో పేరు నమోదు) కోసం రూ.15 వేలు లంచం తీసుకుంటూ అనకాపల్లి జిల్లా మాకవరపాలెం మండలం తామరం వీఆర్‌వో పరవాడ లక్ష్మణరావు శుక్రవారం అవినీతి నిరోధక శాఖ అధికారులకు పట్టుబడ్డాడు. తీసుకున్న నగదును పక్కన ఉన్న అతని బావమరిది కిరణ్‌కు ఇవ్వడంతో ఏసీబీ అధికారులు అతడిని కూడా అదుపులోకి తీసుకున్నారు. ఏసీబీ డీఎస్పీ రమ్య తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మాకవరపాలెం మండలం భీమబోయినపాలెంలో ఒకరికి ఏడు ఎకరాలు ఉంది. ఆయన ఇటీవల చనిపోవడంతో ముగ్గురు కుమారులు భూమిని తమ పేర్లపై మ్యుటేషన్ చేయించుకునేందుకు దరఖాస్తు చేశారు. తామరం వీఆర్‌వో లక్ష్మణరావు భీమబోయినపాలెం ఇన్‌చార్జి. మ్యుటేషన్ చేయాలంటే రూ.15 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీంతో సోదరుల్లో ఒకరు ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. వారు సూచనలతో శుక్రవారం రూ.15వేలతో తహసీల్దారు కార్యాలయానికి వెళ్లారు. అక్కడ వీఆర్‌వో లక్ష్మణరావుకు డబ్బు ఇచ్చారు. ఆయన వెంటనే నగదును పక్కనే వున్న తన బావమరిది కిరణ్‌కు ఇచ్చారు. అనంతరం లక్ష్మణరావు కంప్యూటర్ ఆపరేటర్ రూమ్‌లోకి వెళ్లి విధులు నిర్వహిస్తుండగా అప్పటికే మాటు వేసిన ఏసీబీ అధికారులు వీఆర్వోను, అతడి బావమరిదిని అదుపులోకి తీసుకుని నగదు స్వాధీనం చేసుకున్నారు. తరువాత ఏసీబీ కోర్టుకు తరలించారు. సోదాల్లో డీఎస్పీ రమ్యతో పాటు మరో డీఎస్పీ నాగేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

22 నుంచి నగరంలో సోలార్ ఎక్స్‌పో

» ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్

సీతంపేట, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): రూఫ్‌టాప్ సోలార్‌పై ప్రజలకు అవగాహన కల్పించడంలో భాగంగా ఈనెల 22 నుంచి విశాఖలో సోలార్ ఎక్స్‌పో నిర్వహించనున్నామని ఏపీ ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం తమ కార్యాలయంలో ఎక్స్‌పో పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ సోలార్ ఎనర్జీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆర్ఈ ఎన్ఎక్సటీ పేరిట సోలార్ రెన్యువబుల్ ఎనర్జీ ఎక్స్‌పోను ఆంధ్ర విశ్వవిద్యాలయం గ్రౌండ్స్‌లో మూడు రోజులపాటు నిర్వహిస్తామన్నారు. ఈపీడీసీఎల్ , నెడ్‌క్యాప్ సహకారంతో నిర్వహించనున్న కార్యక్రమంలో వివిధ సోలార్ సంస్థలు,బ్యాంకులు, స్టాల్స్ ఏర్పాటు చేస్తాయని, ఉచిత ప్రవేశం కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సోలార్ ఎనర్జీ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.హేమకుమార్, ఉపాధ్యక్షుడు పి.నాగరాజు, కోశాధికారి సీహెచ్ జయబాబు తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీఎండీ, అధికారులు

టెన్నిస్ చాంపియన్ నిషిత్

విశాఖపట్నం (స్పోర్ట్స్), నవంబరు 8, (ఆంధ్రజ్యోతి): ఐటీఎఫ్ వరల్డ్ టూర్ ఆఫ్ జూనియర్ టెన్నిస్ టోర్నీలో నగరానికి చెందిన నిషిత్ ఆరిమిల్లి చాంపియన్ టైటిల్ కైవశం చేసుకున్నాడు. ఇథియోపియా, ఆడిస్ అబాబాలో జరిగిన సెమీఫైనల్స్‌లో జపాన్‌కు చెందిన వరల్డ్ 513 ర్యాంకర్ ఇజిపుజితాపై 6,-2, 7-6 వరుస సెట్‌లలో గెలుపొందిన నిషిత్...ఫైనల్స్‌లో ఇథియోపియాకు చెందిన దవిత్ షెల్మీ ముసాపై 7-6, 5-4తో విజయం సాధించి టైటిల్‌ను సొంతం చేసుకున్నాడు. ఈ సందర్భంగా సీనియర్ టెన్నిస్ క్రీడాకారులు, కోచ్‌లు నిషిత్, ట్రైనర్ బాలకృష్ణను అభినందించారు.



డెహ్రాడూన్‌లో శిక్షణకు ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ నందాజీ

విశాఖపట్నం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఫుడ్ సేఫ్టీ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో అస్సాం, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, ఉత్తరప్రదేశ్, జమ్ము, కశ్మీర్ రాష్ట్రాలకు చెందిన జిల్లా ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్లకు డెహ్రాడూన్‌లో ఐదురోజుల పాటు శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమానికి జిల్లా అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ జీఏబీ నందాజీ, మరో ఆరుగురు జిల్లాస్థాయి అధికారులు హాజరయ్యారు. ఫుడ్ సేఫ్టీ స్టాండర్స్ కు సంబంధించి నూతన మార్గదర్శకాలు, ఇతర అంశాలపై అధికారులకు శిక్షణ ఇచ్చారు. ఈ నెల నాలుగో తేదీన ప్రారంభమైన శిక్షణ శుక్రవారంతో ముగిసింది. నూతన యాక్ట్‌లు, ఆహార భద్రతకు అనుసరించాల్సిన విధానాలు తెలియజేశారని నందాజీ తెలిపారు.



రాష్ట్రం నుంచి వెళ్లిన అధికారులతో నందాజీ

క్రైం... crime news

హత్య కేసులో ముగ్గురు ముద్దాయిలకు జైలు శిక్ష

విశాఖపట్నం(లీగల్), నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఒక వ్యక్తిని అతి కిరాతకంగా హత్యచేసిన ముద్దాయిలు గెమిలి రాంబాబు, కొర్ల బుజ్జి, గమ్మెలి శ్రీనులకు యావజ్జీవ కారాగార శిక్ష, రాంబాబు, బుజ్జిలకు రూ.60వేలు చొప్పున, శ్రీనుకు రూ.30 వేలు జరిమానా విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్ శుక్రవారం తీర్పు చెప్పారు. జరిమానా చెల్లించని పక్షంలో మరో ఏడాది పాటు జైలు శిక్ష అనుభవించాల్సి ఉంటుందని తీర్పులో పేర్కొన్నారు. జిల్లా కోర్టు ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ కాండ్రేగుల జగదీశ్వరరావు అందించిన వివరాలిలా ఉన్నాయి. అల్లూరి సీతారామరాజు జిల్లా కొయ్యూరు మండలం, మంప పోలీస్‌స్టేషన్ పరిధిలోని బొదరాపల్లికి చెందిన గిడుతూరి సింహాచలం, కొర్ల బొజ్జయ్య, సిద్దుల శిధిలగెడ్డకు చెందిన గెమిలి రాంబాబు, కొర్లబుజ్జి, గమ్మెలి శ్రీనుల మధ్య భూ తగాదాలున్నాయి. ఈ నేపథ్యంలో 2010 మార్చి 13న గెమిలి రాంబాబు, కొర్ల బుజ్జి, గమ్మెలి శ్రీనులు కర్రలు, కత్తులతో గిడుతూరి సింహాచలం, కొర్ల బొజ్జయ్యలపై దాడిచేశారు. బొజ్జయ్య మృతిచెందగా, సింహాచలం తప్పించుకుని పారిపోయాడు. స్థానిక వీఆర్వో ఫిర్యాదు మేరకు మంప పోలీసులు కేసు నమోదుచేసి నేరాభియోగ పత్రాలను కోర్టులో దాఖలు చేశారు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు.

జాయ్ జమీమాపై మరో కేసు నమోదు

ఎంవీపీ కాలనీ, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ధనవంతులను లక్ష్యంగా చేసుకుని హనీ ట్రాప్, ప్రేమ, పెళ్లి పేరిట మోసం చేస్తున్న జాయ్ జమీమాపై ఎంవీపీ పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం మరో కేసు నమోదయింది. ఇప్పటికే ఆమెపై పలు స్టేషన్లలో కేసులున్నాయి. ఈ కేసు పరిధి త్రీటౌన్‌లోకి రావడంతో అక్కడికి బదిలీ చేస్తున్నారు. ఎంవీపీ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఫిర్యాదుదారుడు 2019లో ఉద్యోగం నిమిత్తం విశాఖలో ఉండేవారు. ఆ సమయంలో తాను పనిచేసే ఆఫీసులో కొరుప్రోలు జాయ్‌జమీమాతో పరిచయం ఏర్పడింది. ఈ సందర్భంగా ఆమె తన స్నేహితుడు వేణు రెడ్డిని పరిచయం చేసింది. తన ఫోన్లు కొట్టేసి, బుల్లయ్య కళాశాల సమీపంలోని ఓ ఇంట్లో తనను నిర్బంధించి, మత్తు పదార్థాలు తీసుకోమని బలవంతం చేసేవారని, ఓసారి జమీమా తన గొంతు నులిమి చంపడానికి ప్రయత్నించిందని, శారీరకంగా, మానసికంగా వేధించడమే కాకుండా రూ.2 లక్షలు దోపిడీ చేశారన్నారు.

మనీ ల్యాండరింగ్ కేసులో మరో నలుగురి అరెస్టు

ఎండాడ, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మనీ ల్యాండరింగ్ కేసులో సైబర్ క్రైమ్ పోలీసులు మరో నలుగురిని అరెస్టు చేశారు. నగరానికి చెందిన వ్యక్తికి తెలియని ఫోన్ నెంబరు నుంచి కాల్ వచ్చింది. మీరు మనీ ల్యాండరింగ్ కేసులో చిక్కుకున్నారని, కోర్టు అరెస్టు వారెంట్ జారీ చేసినట్టు చెప్పారు. విచారణకు హైదరాబాద్ రావాలని భయపెట్టారు. ఇలా బాధితుడి వద్ద దఫ దఫాలుగా రూ 16,50,000 కొట్టేశారు. ఈ కేసులో పోలీసులు గతంలో నలుగురిని అరెస్టు చేయగా శుక్రవారం నెల్లూరు జిల్లాకు చెందిన మరో నలుగురిని అరెస్టుచేశారు.

పకీరుతఖ్యాలో రేషన్ బియ్యం పట్టివేత

కూర్మన్నపాలెం,నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా తరలిస్తున్న 4,300 కిలోల పీడీఎస్ బియ్యాన్ని శుక్రవారం పకీరుతఖ్యా వద్ద దువ్వాడ పోలీసులు సీజ్ చేసి స్టేషన్‌కు తరలించారు. పాత అయ్యన్నపాలెం బరాటం రమణమూర్తి కొనుగోలు చేసి, సబ్బవరం రైస్ మిల్లుకు తరలిస్తుంటాడు. ఇలా 22 బియ్యం బస్తాలు, దయాళ్‌నగర్‌కు చెందిన బండారు కృష్ణ 64 బస్తాలు, మొత్తం 4,300 కిలోలను రెండు టాటా ఏసీ వాహనాల్లో తరలిస్తుండగా పట్టుకున్నారు. బియ్యాన్ని సీజ్ చేసి ఏఎస్వోకు అప్పగిస్తామన్నారు. ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రేషన్ బియ్యం చోరీపై ఫిర్యాదు

గాజువాక, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): నడుపూరులోని ఓ రేషన్ దుకాణంలో 172 బియ్యం బస్తాలు చోరీకి గురయ్యాయంటూ డిపో డీలర్ విజయ శుక్రవారం న్యూపోర్టు పోలీసులకు ఫిర్యాదు చేశారు. లబ్దిదారులకు బియ్యం పంపిణీ చేసేందుకు గత నెల 22న స్టాక్ తీసుకొచ్చి డిపోలో నిల్వ ఉంచినట్టు తెలిపారు. ఇందులో 172 బియ్యం బస్తాలు అపహరణకు గురయ్యాయని, స్థానికంగా బియ్యం ఇచ్చే వ్యాన్ ఆపరేటర్‌పై అనుమానం ఉందని పేర్కొన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఏసీపీలుగా కాళిదాస్, చిట్టిబాబు

మహారాణిపేట, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): హార్బర్ ఏసీపీగా ఎస్.కాళిదాస్ నగర స్పెషల్ బ్రాంచి ఏసీపీగా ఐ.చిట్టిబాబు నియమితులయ్యారు. ఈ మేరకు ఉత్తర్వులు విడుదలయ్యాయి. నార్త్ కోస్టల్ సెక్యూరిటీ డీఎస్పీ ఎస్.కాళిదాస్‌ను హార్బర్ ఏసీపీగా, విజయనగరం ఐదో బెటాలియన్‌కు చెందిన చిట్టిబాబును సీఎస్‌బీ ఏసీపీగా నియమించారు.

మళ్లింపు మార్గంలో పలు రైళ్లు

విశాఖపట్నం, నవంబరు 8, (ఆంధ్రజ్యోతి): విజయవాడ డివిజన్‌లో భద్రతా నిర్మాణ పనుల నేపథ్యంలో ఈనెల 11, 12, 13 తేదీల్లో పలు రైళ్లను మళ్లించామని సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. ధన్‌బాద్-అలెప్పీ బొకారోకు ఈనెల 11, 12 తేదీల్లో తాడేపల్లిగూడెం, ఏలూరు స్టేషన్లలో హాల్ట్ ఉండదు. విశాఖ-విజయవాడ జనసాధారణ ప్రత్యేక రైలుకు 13న తాడేపల్లిగూడెం, ఏలూరు, గన్నవరం స్టేషన్లలో హాల్ట్ ఉండదు. 11న హటియా-ఎర్నాకులం ఏసీ, 12న హటియా-ఎస్ఎంవీ బెంగళూరు రైళ్లు నిడదవోలు, భీమవరం టౌన్, గుడివాడ మీదుగా నడుస్తాయన్నారు.